www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -265 మంగళవారం 30 డిసెంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

## హాజరైన సిఎం రేవంత్, విపక్షనేత కెసిఆర్

కెసిఆర్‌కు నమస్కరించి ఆరోగ్యంపై సిఎం వాకబు -కెసిఆర్‌ను కలిసి పలకరించిన మంత్రులు

కెసిఆర్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు -అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు



హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముందుగా సంతాప తీర్మానాలు ప్రవేశపెట్టారు. దివంగత నేత రాంరెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డికి సభ సంతాపం ప్రకటించింది. మిగతా 2లో...

## ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

రెండు ఏసీ బోగీలు అగ్నికి ఆహుతి

మంటల్లో చిక్కుకుని ఒకరు మృతి



యలమంచిలి**డిసెంబర్: 29:**
టాటానగర్ నుంచి ఎర్నాకుళం వెళ్తున్న ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో అనకాపల్లి జిల్లా యలమంచిలి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున మంటలు వ్యాపించి రెండు ఏసీ బోగీలు అగ్నికి ఆహుతయ్యాయి. బయటకు రాలేక ఒకరు మృతి చెందారు.సౌత్ సెంట్రల్ డిఆర్‌ఎం మోహిత్ సోనాకియా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మిగతా 2లో...

## ఉన్నావ్ లైంగికదాడి కేసులో సెంగార్‌కు షాక్

హైకోర్టు ఉత్తర్వులపై సుప్రీం స్టే

'ప్రజా సేవకుడు' అనే పదానికి హైకోర్టు ఇచ్చిన వివరణ తప్పు

హర్షం వ్యక్తం చేసిన బాధితురాలు

న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందంటూ వెల్లడి



న్యూఢిల్లీ ,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
ఉన్నావ్ లైంగికదాడి కేసులో బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన బెయిల్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. 2017లో ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో ఓ యువతిని ఉద్యోగం ఇస్తానని ఇంటికి పిలిచి నాటి బీజేపీ ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్ లైంగికదాడికి పాల్పడిన ఘటనపై ఆయనకు న్యాయస్థానం జీవిత ఖైదీ శిక్షను విధించిన విషయం విదితమే. అయితే ఆయనకు విధించిన జీవిత ఖైదును రద్దు చేస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై విమర్శలు వెల్లువెత్తాయి. అటు బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. మరోవైపు ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఇద్దరు న్యాయవాదులు అంజలే పటేల్, పూజా శిల్ప్కర్, సీబీఐ వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి.
సోమవారం ఈ పిటిషన్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జెకె.మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది మిగతా 2లో...

## బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం



అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన అమిత్ షా

బంగ్లాదేశీయులు ఇక్కడి వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం

అలాంటి వారిని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా భావిస్తోందని ఆరోపణ

భారతదేశంలో ఎక్కడ ఉన్నా బంగ్లాదేశ్ చొరబాటుదారులను వెనక్కి పంపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. అసోంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సరిహద్దులు దాటి రాష్ట్రంలోకి చొరబడిన బంగ్లాదేశీయులు ఇక్కడి ప్రజల సంస్కృతి, గుర్తింపులకు ముప్పుగా పరిణమిస్తున్నారని అన్నారు. మిగతా 2లో...

## 'పాత బాస్' కోసమే రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును నిలిపివేశారు

కేసీఆర్‌కు పేరు వస్తుందన్న భయంతో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపణ

ఆర్థిక ప్రయోజనాల కోసమే జీహెచ్ఎంసీ విభజనకు కుట్ర అంటూ ఫైర్

ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ కావడం లేదని సీఎం చెప్పగలరా అని ప్రశ్న

కాంగ్రెస్ ప్రభుత్వంపై సర్పంచ్ ఎన్నికలే ప్రజా తీర్పు అని ఉద్ఘాటన



హైదరాబాద్,,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 'పాత బాస్', ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును ప్రసన్నం చేసుకునేందుకే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మాజీ సీఎం కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే భయంతో పాటు, చంద్రబాబుకు ఆగ్రహం కలుగుతుందనే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి పనులను ముందుకు సాగనీయడం లేదని ఆయన విమర్శించారు. సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, .మిగతా 2లో...

## జిల్లాల పునర్విభజనకు కేబినేట్ ఆమోదం

### కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాలు

- రాష్ట్రంలోని 28కి పెరగనున్న జిల్లాల సంఖ్య
- మదనపల్లె కొత్త జిల్లాలో రాయచోటి విలీనం
- రాయచోటి మార్పుపై కన్నీరు పెట్టుకున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి



అమరావతి,,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**జిల్లాల ఏర్పాటు, పునర్విభజనలపై ఏపీ క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాల పునర్విభజన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మంత్రివర్గ నిర్ణయంతో కొత్తగా మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరం జిల్లాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో రాష్ట్రంలోని జిల్లాల సంఖ్య 28కి పెరగనుంది. దీనికి సంబంధించి తుది గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటిని మదనపల్లె కొత్త జిల్లాకు,మిగతా 2లో...

## యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో సంక్షేమ పథకాలు

ప్రతి గడపకు చేరేలా బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్'

అవార్డుల ప్రదానోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్,,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
:ఇవాళ తెలంగాణ గర్వించదగ్గ రోజు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'ప్రజా ప్రభుత్వం' దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక అద్భుతమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టిందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ ఎలా చేరుతున్నాయో ప్రపంచానికి చాటిచెప్పే బాధ్యతను మన యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో పెట్టాం అన్నారు.తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్. మిగతా 2లో...

## తిరుమల చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి...

స్వాగతం పలికిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

కుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్న రేవంత్ రెడ్డి



తిరుమల,,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం తిరుమల క్షేత్రానికి చేరుకున్నారు. ఆయనకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను చైర్మన్ శాలువాతో సత్కరించి,మిగతా 2లో...



## తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు

క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు -టోకెన్లు ఉన్నవారికే దర్శన భాగ్యం

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# జిల్లాల పునర్విభజనకు కేబినెట్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

రాజంపేటను కడప జిల్లాకు, రైల్వే కోడూరును తిరుపతి జిల్లాకు, గూడూరును తిరుపతి జిల్లా నుంచి నెల్లూరులో కలిపే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మరోవైపు కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ క్యాబినెట్ సమావేశంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి (ఖీజీపూసజీబజీట ఖీ।టటా) కన్నీటి పర్యంతమయ్యారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటి మార్పుపై ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో ఆయన కన్నీరు పెట్టుకున్నారు. మంత్రి రాంప్రసాద్‌ను సీఎం చంద్రబాబు ఓదార్చారు. జిల్లా కేంద్రం మార్చుకుంటే తలెత్తే సాంకేతికపరమైన ఇబ్బందులను మంత్రికి ఆయన వివరించారు. రాయచోటి అభివృద్ధి విషయాన్ని తాను చూసుకుంటానని చంద్రబాబు ఇచ్చారు. రాంప్రసాద్‌రెడ్డి ప్రస్తుతం రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో సాంకేతిక అంశాలను పక్కన పెట్టి జిల్లాల పునర్విభజనను గత వైసీపీ ప్రభుత్వం చేపట్టడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని పరిష్కరించేందుకు చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా రాయచోటినే ఉంచాలంటూ ఆందోళనలు, నిరసనలకు దిగారు. ముఖ్యంగా ఈ అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి మార్పుపై మంత్రి రాం ప్రసాద్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. దాంతో ఈ సమావేశంలో కొద్ది సేపు నిశబ్దం ఆవరించింది. జిల్లా కేంద్రం మార్చుకుంటే ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను మంత్రి రాం ప్రసాద్‌కు సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. రాయచోటి అభివృద్ధిని తాను చూసుకుంటానంటూ మంత్రి రాం ప్రసాద్ రెడ్డికి సీఎ చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితోపాటు రాం ప్రసాద్ రెడ్డి కేబినెట్ నుంచి బయటకు వచ్చారు. కానీ మీడియా ప్రతినిధులతో మాట్లాడకుండానే రాం ప్రసాద్ రెడ్డి బయటకు వెళ్లిపోయారు.

# ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

(మొదటి పేజీ తరువాయి)

టాటానగర్ నుంచి ఎర్నాకుళం వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు (18189)లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు ఒంటిగంట సమయంలో యల మంచిలి రైల్వే స్టేషన్‌కు సమీపంలోకి వచ్చేసరికి బీ1, ఎం2 బోగీల్లో మంటలు వ్యాపించాయి. దీంతో, అప్రమత్తమైన ప్రయాణికులు చైన్ లాగారు. అదే సమయంలో పొగలు రావడం గమనించిన లోకో పైలెట్, గార్డ్ యలమంచిలి రైల్వే స్టేషన్లో రైలును నిలిపివేశారు. మంటలు వ్యాపించిన రైలు బోగీలను లోకో పైలెట్లు రైలు నుంచి విడదీసి రైలును దూరం చేశారు. రైలులోని బి1 బోగీలో 76 మంది, ఎం2 బోగీలో 82 మంది ప్రయాణికులు ఉన్నారు. అందరు క్షేమంగా దిగిపోగా, బి1లో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన సుందర్ చంద్రశేఖర్ (70) రైలు దిగలేక బోగీలో ఉండిపోయి మంటల్లో కాలిపోయి మృతి చెందారు.

రైలు బోగీలకు వ్యాపించిన మంటలను యలమంచిలి, నక్కపల్లి, అనకాపల్లి నుంచి నాలుగు అగ్నిమాపక వాహనాలు సుమారు నాలుగు గంటల పాటు కష్టపడి అదుపులోకి తీసుకొచ్చాయి. అనంతరం సుమారు తెల్లవారుజామున 5.30 గంటలు సమయంలో బి1, ఎం2 బోగీలను, వాటిలో ప్రయాణికులను అక్కడే వదిలేసి రైలు బయలుదేరి వెళ్లింది. ఆ కాలిన బోగీలను యలమంచిలి రైల్వే యార్డ్‌కు తరలించారు. ఈ రెండు బోగీల్లోని ప్రయాణికులను బస్సుల్లో సామర్లకోట వరకు తరలించి, అక్కడ ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌కు రెండు అదనపు బోగీలను అమర్చి ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చే ఏర్పాట్లు చేసినట్లు డిఆర్ఎం తెలిపారు. చంద్రశేఖర్ మృతదేహాన్ని యలమంచిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారం అందిస్తామని డిఆర్ఎం తెలిపారు. రైల్వే క్లూస్ టీం, ఫోరెన్సిక్ టీం వారు రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. దర్యాప్తు అనంతరం ప్రమాదానికి కారణాలను వెల్లడిస్తామని డిఆర్ఎం తెలిపారు.

### కదిలిన అనకాపల్లి జిల్లా యంత్రాంగం

రైలు ప్రమాదం విషయం తెలిసిన వెంటనే అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్‌పి తుహిన్ సిన్హా తమ పరివారంతో అక్కడకు వచ్చి పరిశీలించారు. స్థానిక రెవెన్యూ అధికారులు ప్రయాణికులకు అల్పాహారం అందించి, వారిని బస్సుల్లో పంపించే ఏర్పాట్లు చేశారు. రైల్వే డీఐజీ బి.సత్య ఏసుబాబు, అనకాపల్లి ఆర్‌డిఓ షేక్ అయేషా, యలమంచిలి తహశీల్దార్ వరహాలరావు యలమంచిలి సీఐ ధనుజయరావు, ఎస్ఐ సావిత్రి, రైల్వే అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

# తిరుమలలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

## ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు

### క్యూలైన్లలో భక్తులకు అన్నప్రసాదాలు

### -టోకెన్లు ఉన్నవారికే దర్శన భాగ్యం

తిరుమల,,,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**

శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి భారీగా ఏర్పాట్లు చేశారు. డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న ప్రతిష్టాత్మక వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తులకు స్వామివారి దర్శనాన్ని దివ్య అనుభూతిగా మార్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి అన్నారు.

ఈసారి వైకుంఠ ద్వార దర్శనాలకు టోకెన్ల కేటాయింపులో విధానాత్మక మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. వైకుంఠ ద్వార దర్శన విధులకు వచ్చిన సిబ్బంది వ్యవస్థను పూర్తిగా అర్థం చేసుకుని సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని అధికారులతో అన్నారు. భక్తుల భద్రత, రద్దీ నిర్వహణకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక ఏఐ సాంకేతికత వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ సాంకేతికత ద్వార భక్తులు, వాహనాల రద్దీపై ప్రత్యక్ష పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. టీటీడీ, పోలీస్, విజిలెన్స్ విభాగాల నుండి ఐటీ నిపుణులు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు భక్తుల సమాచారాన్ని అప్డేట్ చేస్తూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 లోని ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల సెంటర్ లో ప్రదర్శించాలని చెప్పారు. భవిష్యత్తులో తిరుమలకు వచ్చే భక్తుల కోసం సమస్య రహిత వ్యవస్థను నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేసినట్లు టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. క్యూలైన్లలో ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలు, అన్న ప్రసాదం పంపిణీ, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించి భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైకుంఠ ద్వార దర్శనాలు పురస్కరించుకుని చాలా వరకు

ఏర్పాట్లను ఇప్పటికే పూర్తి చేశామని చెప్పారు. భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని క్యూలైన్లలో పలు మార్పులు చేపట్టామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులు కూర్చునేవిధంగా ఏర్పాట్లు చేయడంతో పాటు, తాగునీటి సౌకర్యం, క్యూలైన్లకు అనుసంధానంగా అదనపు మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. చలికాలం కావడంతో క్యూలైన్లలోని అన్న ప్రసాదాల పంపిణీ కేంద్రాల్లో అన్న ప్రసాదాలు చల్లబడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకునే ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా భక్తులకు తాగునీరు అందించేందుకు అదనంగా మొబైల్ వాటర్ డ్రమ్స్, మూడు మొబైల్ ఫుడ్ వ్యాన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తుల కోసం టీటీడీ అందుబాటులో ఉంచిన సదుపాయాలను వినియోగించు కునేందుకు వివిధ భాషల్లో సూచిక బోర్డులను కూడా క్యూలైన్లలో మరియు ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. భక్తులందరూ టీటీడీ క్యూలైన్లలో కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని సంయమనంతో స్వామివారిని దర్శించుకోవాలని తెలియజేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలను పురస్కరించుకుని విచ్చేసే భక్తుల రద్దీ దృష్ట్యా డిసెంబర్ 28 నుండి జనవరి 7వ తేది వరకు తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ లో భక్తులకు ఇచ్చే ఃూఆ టోకెన్ల జారీని రద్దు చేయడం జరిగింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించవలసిందిగా భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేయడమైనది. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు. తొలి మూడు రోజులు అనగా, డిసెంబర్ 30, 31 మరియు జనవరి 01వ తేదీల్లో ఈ-డిప్ ద్వారా టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం.

టోకెన్ పొందిన భక్తులు తమకు కేటాయించిన తేదీలలో నిర్దేశిరచిన సమయానికి మాత్రమే తిరుమలలోని దర్శన ప్రవేశ మార్గాలకు చేరుకోవాల్సి ఉంటుంది. వైకుంఠ ఏకాదశి నుంచి పదిరోజుల పాటు తిరుమలలో భక్తులకు ఏ ఇబ్బందులూ రాకుండా పక్కాగా ఏర్పాట్లు చేసినట్లు తితిదే అదనపు ఈఓ వెంకయ్య చౌదరి వెల్లడించారు. తొలిరోజు ప్రొటోకాల్ దర్శనాలు ముగిసిన వెంటనే స్లాటెడ్ సర్వదర్శనం మొదలవుతుంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత 1:30 నుంచి మంగళవారం రాత్రి 11:45 గంటల మధ్య.. 20 గంటల పాటు సామాన్యులకే అవకాశం కల్పిస్తాం. సుమారు 70వేల మందికి దర్శనం చేయించాలన్నది లక్ష్యం. ఏ రోజు టోకెన్ పొందితే, అదేరోజు దర్శనం చేయించేలా గంటలవారీగా లెక్కలు కట్టి అమలుచేస్తాం. ఇందుకోసం ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వినియోగించనున్నాం. భక్తులు టోకెన్‌పై నిర్దేశిరచిన సమయానికి, సూచించిన ప్రదేశానికి రావాలి. వేచి ఉండే భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, దద్దోజనం తదితర 16 రకాల ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నాం. మొదటి మూడు రోజులు 24 గంటలూ అన్నప్రసాదాలు, వేడి పానీయాలు కాఫీ, టీ, బాదం పాలు, చిన్నపిల్లలకు పాలు సిద్ధంగా ఉంటాయి. నిత్యం 4.30 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచుతున్నాం. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు డిజిటల్ పేమెంట్ కియోస్కులు ఏర్పాటుచేశాం. నగదురహితంగా స్లిప్పులు పొంది నేరుగా లడ్డూలు తీసుకోవచ్చు. పూర్తిగా ఆటోమేటెడ్ సిస్టమ్‌లో గదులు కేటాయిస్తున్నాం. కొత్తగా అందుబాటులోకి వచ్చిన వెంకటాద్రి నిలయం (పీఏసీ-5)లో అద్భుత వసతులున్నాయి. భక్తులు గదుల కోసం వేచిచూడకుండా, ఇక్కడ స్నానాదులు ముగించుకుని తమ స్లాట్ ప్రకారం దర్శనానికి వెళ్తే మంచిదని సూచించారు.

# తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచ్‌లు ముట్టడిస్తారనే సమాచారంతో ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. అలాగే అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దాదాపు వెయ్యి మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఈ సమావేశాలకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్ తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కేసీఆర్ వద్దకు రేవంత్‌రెడ్డి వెళ్లి బాగున్నారా అని పలకరించారు. ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనకు పలకరించి అభివాదం చేశారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. జీహెచ్‌ఎంసీలో ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీల విలీనం, జీహెచ్‌ఎంసీ పరిధి పెరిగినందున వార్డుల సంఖ్య 150 నుంచి 300కి పెంపు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన తొలగింపు, తెలంగాణ జీఎస్టీ సవరణ, ఉద్యోగుల హేతుబద్ధీకరణ తదితర అంశాలకు చట్టబద్ధత కల్పించనున్నారు. తొలిరోజు సభ వాయిదా అనంతరం బీఏసీ సమావేశం నిర్వహించనున్నారు. శాసనసభ, మండలి ఎన్నిరోజులపాటు నిర్వహించాలనేదానిపై నిర్ణయం తీసుకోనున్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే బీఆర్ఎస్ అధినేత తిరుగుపయనం అయ్యారు. సంతాప తీర్మానాలు ముగిసిన వెంటనే కేసీఆర్ అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. కాగా.. కేసీఆర్ సోమవారం ఉదయం నందినగర్‌లోని నివాసం నుంచి అసెంబ్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎంకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. ఆపై కేసీఆర్‌ను ఎమ్మెల్యేలు సభలోకి తీసుకెళ్లారు. కేసీఆర్ వెళ్లిన కాసేపటికే తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మిగతా సభ్యులు అందరికంటే ముందుగానే కేసీఆర్ వెళ్లి తన చైర్‌లో కూర్చున్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ హాల్లోకి రాగానే కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. అలాగే సీఎం తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కేసీఆర్ దగ్గరికి వెళ్లి కరచాలనం చేశారు. ఆపై సభ ప్రారంభం కాగానే కొద్దిసేపు మాత్రమే సభలో ఉన్నారు కేసీఆర్. తర్వాత మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు బయటికి వచ్చారు. అనంతరం అసెంబ్లీ నుంచి తిరిగి నందినగర్ నివాసానికి గులాబీ బాస్ వెళ్లిపోయారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్ దగ్గరకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ దగ్గరికి వెళ్ళి బాగున్నారా అని సీఎం పలకరించగా.. తిరిగి బాగున్నాను అంటూ రేవంత్‌కు కేసీఆర్ సమాధానం ఇచ్చారు. అలాగే కేసీఆర్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్ పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ ఎమ్మెల్యే కునమనేని సాంబశివరావు కలిసి కరచాలనం చేశారు. దక్షిణ తెలంగాణకు జీవనాడి అయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు గురించి అసెంబ్లీలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అవసరమైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ప్రధాన ప్రతిపక్షం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో అధికార పక్షం అప్రమత్తమైనట్టు తెలిసింది. సాగునీటిపై షార్ట్ డిస్కషన్‌ను అనుమతించి సాధ్యమైనంత వరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరణతోనే నెట్టుకురావాలని నిర్ణయించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు సాగదీయకుండా రెండు, మూడు రోజుల్లోనే ముగించాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇదిలా ఉండగా, అసెంబ్లీ చరిత్రలో మొదటిసారిగా జ్యుడీషియరీ క్యాడర్ నుంచి వచ్చిన అధికారి ఆర్ తిరుపతి అసెంబ్లీ కార్యదర్శి హోదాలో

శాసనసభను నడిపించబోవడం విశేషం. ఇప్పటి వరకు అసెంబ్లీ క్యాడర్ అధికారులే ఈ బాధ్యత నిర్వర్తించేవారు.

# తిరుమల చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి...

(మొదటి పేజీ తరువాయి)

శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, ఏపీ మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ కూడా పాల్గొన్నారు.

రేపు (మంగళవారం) ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి శ్రీవారిని దర్శించుకోనున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

కాగా, సీఎం రేవంత్ రెడ్డి రేపు సాయంత్రం హైదరాబాద్ తిరిగి వస్తారు. ఎల్లుండి నుంచి అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారు.

# యువ ఫిల్మ్ మేకర్ల చేతుల్లో సంక్షేమ పథకాలు

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్ నిర్వహించిన ఈ 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' కేవలం ఒక పోటీ మాత్రమే కాదు.. ఇది మన యువత మేధస్సుకు, సృజనాత్మకతకు ఒక గొప్ప వేదికన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి, ముఖ్యంగా మారుమూల గ్రామాల నుండి వచ్చిన ఎంట్రీలను చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్' అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం రవీంద్ర భారతిలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి... రాష్ట్ర టూరిజం, కల్చరర్,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై విజేతలను ప్రకటించి,అవార్డులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి 3లక్షలు,రెండో బహుమతి 2లక్షలు,మూడో బహుమతి 1లక్ష.. షార్ట్ ఫిల్మ్,బతుకమ్మ వీడియో విభాగాలకు వేరు వేరుగా నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ మీరంతా ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఒక చైతన్యవంతమైన వారధిలా నిలిచారు. పల్లెల్లో ఉన్న అపారమైన ప్రతిభను ఈ వేదిక ద్వారా ప్రపంచానికి పరిచయం చేయడం సినిమాటోగ్రఫీ మంత్రిగా నాకు ఎంతో గర్వకారణం. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క యంగ్ ఫిల్మ్ మేకర్ కు నా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాను. గెలుపొందిన విజేతలకు నా ప్రత్యేక శుభాకాంక్షలు. మీ ప్రయాణం ఇక్కడితో ఆగిపోకూడదు.. తెలంగాణ భవిష్యత్తును మీ కళాత్మక దృష్టితో మరింత గొప్పగా తీర్చిదిద్దాలని కోరుకుంటున్నానని మంత్రి పేర్కొన్నారు. తాను గతంలో దిల్ రాజు నిర్మించిన బలగం సినిమా చూసాను.. ఇటీవల వచ్చిన 'దండోరా' సినిమా చూసాను..సమాజానికి మంచి మెసేజ్ ఇచ్చేలా,హృదయానికి దగ్గరయ్యే విధంగా ఉన్నాయి అని అన్నారు. అదేవిధంగా తెలంగాణలో సినిమాలు తీసుకోవడానికి లోకేషన్స్ పరంగా కూడా టూరిజం డెవలప్మెంట్ చేస్తున్నామని, దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీశైలం మల్లన్న దర్శనానికి ఘాట్ రోడ్డు,అటవీ మార్గాన వెళ్లే బాధలు తప్పించేందుకు 8వేల కోట్లతో మన్ననూర్ - శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నాం. ఇది సినిమా, షార్ట్ ఫిలిమ్స్ కు మంచి లొకేషన్ అవుతుంది' అని అన్నారు. కార్యక్రమంలో ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, :ఎఫ్‌డిసి ఛైర్మన్ సీహెచ్.ప్రియాంక,దర్శకులు హరీష్ శంకర్,తనికెళ్ళ భరణి,దశరథ్,రాహుల్ సిప్లిగంజ్,అశోక్ కుమార్,శ్రీలక్ష్మి,పీ.జీ. విందా,మంగ్లీ,సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ తోపాటు పెద్ద సంఖ్యలో యువ దర్శకులు, కళాకారులు, సినీ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉన్నావ్ లైంగికదాడి కేసులో సెంగార్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)

బాధితురాలి భద్రతకు సంబంధించిన అంశాలతో సీబీఐ ప్రస్తావించిన అంశాలను ధర్మాసనం పరిశీలించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సెంగార్‌ను ఆదేశించింది. అలాగే డిసెంబర్ 23న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీర్ సింగ్ సెంగార్‌ను జైలు నుంచి విడుదల చేయొద్దని సూచించింది. సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని కోరారు.

సెంగార్ తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ దవే, ఎన్. హరిహరన్ వాదనలు వినిపిస్తూ సీబీఐ పిటిషన్‌ను వ్యతిరేకించారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో చట్టం) సెక్షన్ 5 కింద 'ప్రజా సేవకుడు (పబ్లిక్ సర్వెంట్)' అనే పదానికి హైకోర్టు ఇచ్చిన వివరణ తప్పుగా ఉందని, చివరికి చట్టాన్ని రూపొందించే వారిని మినహాయింపునకు దారి తీస్తుందని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. "చట్టపరమైన సమస్యను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ ఉత్తర్వును జారీ చేసిన హైకోర్టు న్యాయమూర్తులు అత్యుత్తమ న్యాయమూర్తులు. కానీ మనమందరం తప్పులు చేసే అవకాశం ఉంది. దయచేసి పోక్సో కింద "పబ్లిక్ సర్వెంట్" అనే దానికి ఈ నిర్వచనాన్ని చూడండి. చట్టం ప్రకారం ఒక కానిస్టేబుల్ ప్రభుత్వ సేవకుడిగా ఉంటాడని, కానీ శాసనసభ సభ్యుడు మినహాయించబడతారని మేము ఆందోళన చెందుతున్నాం" అని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది.

**న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది : బాధితురాలు**

ఉన్నావ్ లైంగికదాడి కేసులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం పట్ల బాధితురాలు సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. "ఈ నిర్ణయంతో నేను చాలా సంతోషంగా ఉన్నాను. సుప్రీంకోర్టు నుంచి నాకు న్యాయం లభించింది. నేను మొదటి నుంచీ న్యాయం కోసం నా గొంతును వినిపిస్తున్నా. నేను ఏ కోర్టుపైనా ఆరోపణలు చేయను. నాకు అన్ని కోర్టులపై నమ్మకం ఉంది. కానీ సుప్రీంకోర్టు నాకు న్యాయం చేసింది. అలానే కొనసాగుతుంది" అని బాధితురాలు అన్నారు.

# బంగ్లాదేశ్ చొరబాటుదారులు దేశంలో ఎక్కడున్నా పంపించేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ వారిని ఓటు బ్యాంకుగా చూస్తోందని ఆయన ఆరోపించారు.

ఆ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు ప్రతిపక్ష కూటమి ఓటరు జాబితా ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తోందని విమర్శించారు. అసోంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని దుయ్యబట్టారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజల సాంస్కృతిక గుర్తింపును కాపాడటంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించిందని తెలిపారు.

బంగ్లాదేశ్ చొరబాటుదారులు ఆక్రమించుకున్న లక్షకు పైగా బిఘాల భూమిని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడిపించిందని కొనియాడారు. రాష్ట్రంలో పాతుకుపోయిన చొరబాటుదారులను పూర్తిగా నిర్మూలించడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. గత 11 ఏళ్లలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పలు మిలిటెంట్ సంస్థలతో శాంతి ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు.

# 'పాత బాస్' కోసమే రేవంత్ రెడ్డి ఆ ప్రాజెక్టును నిలిపివేశారు

(మొదటి పేజీ తరువాయి)

పాలమూరు ప్రాజెక్టుకు కేవలం 45 టీఎంసీల కేటాయింపులను అంగీకరించడం రాష్ట్రానికి నష్టదాయకమని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కృష్ణా జలాల్లో 299 టీఎంసీలకు అంగీకరించిందని, దాని ఆధారంగానే బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కోరిందని గుర్తుచేశారు. కేసీఆర్ చిత్తశుద్ధి వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిందని, దానిపై ఎన్ని విచారణలు జరిపినా రాజకీయంగా తమకు నష్టం లేదని, నీళ్లు ఇచ్చిందెవరో ప్రజలకు తెలుసని అన్నారు.

ఆర్థిక ప్రయోజనాల కోసమే, మర్చంట్ బ్యాంకర్లు, బ్రోకర్ల సలహాతో జీహెచ్‌ఎంసీని మూడు భాగాలుగా విభజించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఈ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని, అసెంబ్లీలో చర్చిస్తామని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై స్పందిస్తూ, నిఘా వ్యవస్థలు నెహ్రూ కాలం నుంచి ఉన్నాయని, ప్రస్తుతం ప్రతిపక్ష నేతల ఫోన్లు ట్యాప్ కావడం లేదని సీఎం కచ్చితంగా చెప్పగలరా అని ప్రశ్నించారు.

సిట్‌లు, విచారణల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లిస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల ఫలితాలే కాంగ్రెస్ పాలనపై ప్రజా తీర్పు అని, రెండేళ్లలోనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
మంగళవారం 30 డిసెంబర్ 2025

# కొందుర్గు ఎంపీడీవో ఆఫీసులో అధికారుల 'నిర్లక్ష్య' పర్వం

**మధ్యాహ్నం 12 అయినా కానరాని సిబ్బంది.. 'వస్తున్నాం' అంటూ కాలయాపన**

**పడి కాపులు కాస్తున్న ప్రజలను వెక్కిరిస్తున్న ఖాళీ కుర్చీలు**






**ప్రజావినికిడి,(షాద్ నగర్):**ప్రభుత్వ కార్యాలయాల్లో పనివేళలు అంటే అధికారులకు లెక్కలేకుండా పోతోంది. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కొందుర్గు మండల పరిషత్ కార్యాలయం (ఎంపీడీవో) సోమవారం అధికారుల గైర్హాజరుతో వెలవెలబోయింది. మధ్యాహ్నం గడియారంలో ముల్లు 12 గంటలు దాటుతున్నా, కార్యాలయంలో కుర్చీలు తప్ప అధికారులు ఎవరూ కనిపించకపోవడం గమనార్హం.

### ఖళీ కుర్చీలే 'స్వాగతం'..

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ పనుల నిమిత్తం ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు.కానీ గంటలు గడుస్తున్నా కార్యాలయంలో ఏ ఒక్క అధికారి కూడా సీటులో లేరు. కార్యాలయం లోపల అధికారులు లేకుండా కేవలం ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుండటంతో దూరప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కోసం కార్యాలయ ఆవరణలో పడిగాపులు కాస్తూ జనం అసహనానికి గురవుతున్నారు.

### వివరణ కోరగా.. విడ్డూరమైన సమాధానం

దీనిపై కొంతమంది మీడియా ప్రతినిధులు, బాధితులు అధికారులను ఫోన్ ద్వారా వివరణ కోరగా..వారి నుండి విడ్డూరమైన సమాధానం రావడం గమనార్హం.మేము ఆఫీసుకే వస్తున్నాం.. కాకపోతే రావడానికి కొద్దిగా సమయం పడుతుంది..అంటూ నిర్లక్ష్యంగా బదులిస్తున్నారు.12 గంటలు దాటినా ఇంకా ఆఫీస్ కు రాకపోవడం, పైగా సమయం పడుతుందని చెప్పడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.

### ప్రభుత్వ నిబంధనలు గాలికేనా?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10:30 గంటలకే అధికారులు విధులకు హాజరు కావాల్సి ఉండగా,కొందుర్గులో మాత్రం అధికారులు తమ సొంత నిబంధనలను అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది.ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ.. ప్రజలకు అందుబాటులో ఉండకపోతే ఎలా? అని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఇష్టారాజ్యం వల్ల సామాన్యుల సమయం,డబ్బు వృధా అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

జిల్లా ఉన్నతాధికారులు, ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయానికి రాకుండా సమయం పడుతుందని సాకులు చెబుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మండల పరిపాలనను గాడిలో పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక డ్రైవ్

**ఎలికట్ట చౌరస్తాలో పోలీసుల ప్రత్యేక డ్రైవ్**



ప్రజావినికిడి,(షాద్‌నగర్):పట్టణంలో నేరాలకు అడ్డుకట్ట వేసే దిశగా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.పట్టణ కేంద్రంలోని ఎలికట్ట చౌరస్తాలో ఎస్ఐ రామచందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీలు నిర్వహించి, అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ప్రశ్నించారు.ప్రజల భద్రతే లక్ష్యంగా నేరాల నియంత్రణ కోసం ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లను నిరంతరం కొనసాగిస్తామని ఎస్ఐ రామచందర్ తెలిపారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో గస్తీ పెంచడంతో పాటు, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పట్టణంలో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని,అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ డ్రైవ్‌లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**చేగూర్,చించోడు,మొగిలిగిద్ద గ్రామాలను**

## మండలాలుగా ఏర్పాటు చేయాలి

**తెలంగాణ రాష్ట్ర శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు ఆలస్యంపై మండలిలో ప్రశ్నించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



ప్రజావినికిడి,(షాద్ నగర్):చిన్న మండలాలతోనే అభివృద్ధి మౌలిక వసతుల ఏర్పాటు సాధ్యమని ప్రజల ప్రజలు కోరుకుంటున్నారని షాద్ నగర్ నియోజక వర్గంలోని చేగూరు,చించోడు మొగిలిగిద్ద గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేయాలని అక్కడ ప్రజలు కోరుకుంటున్నారని శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రజల తరఫున తన వాయిస్ ని వినిపించారు.అంతేకాకుండా ఏడాది క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వచ్చి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు శంకుస్థాపన చేసిన కూడా ఇప్పటివరకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై ఎటువంటి పనులు జరగకపోవడం బాధాకరమని,దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులని ప్రారంభించాలని ప్రభుత్వానికి తెలియజేశారు.

## కేసీఆర్ కు స్వాగతం పలికిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

### అసెంబ్లీ ప్రాంగణంలో కేసీఆర్ కు పుష్పగుచ్ఛం అందజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

ప్రజావినికిడి,(షాద్ నగర్): తెలంగాణ శాసనసభ శాసనమండలిలో జరగనున్న సమావేశాల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ హాజరైన సందర్భంలో అసెంబ్లీ ప్రాంగణంలో కేసీఆర్ కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..



## ఎంజిఆర్ కు ఉస్మానియా డాక్టరేట్



**ప్రజావినికిడి, (ముషీరాబాద్):** ఎంపిక చేసిన కంపెనీలపై దృష్టి సారించి,సంస్థాగత వ్యూహాలను రూపొందించడం, వ్యాపార ఫలితాలను మెరుగుపరచడంలో హెచ్ ఆర్ అనలిటిక్స్ టెక్నాలజీతో పరివర్తన పాత్రను అన్వేషిస్తుంది. ఈ అధ్యయనం మానవ వనరుల నిర్వహణ,వ్యాపార వ్యూహ రంగానికి గణనీయంగా దోహదపడుతుంది, డేటా ఆధారిత హెచ్ ఆర్ పద్ధతులు కార్పొరేట్ లక్ష్యాలతో ఎలా సమలేఖనం అవుతాయో అంతర్దృష్టులను అందించే ఈ పరిశోధనకుగాను మద్దెల రాంచందర్ గౌడ్ కు ఉస్మానియా విశ్వవిద్యాలయం అధికారికంగా డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీని ప్రదానం చేశారు.ఈ పరిశోధన ఉస్మానియా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు చెందిన ఎమెరిటస్ ప్రొఫెసర్ విద్యాధర్ రెడ్డి గౌరవనీయ పర్యవేక్షణలో జరిగింది.ఈ విజయానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ ఎంజిఆర్ ను అభినందించింది.తన వృత్తిపరమైన, పరిశోధన ప్రయత్నాలలో మరింత విజయం పొందాలని ఆకాంక్షించారు.

## ఎగ్జిబిషన్లో స్టాల్స్ ఎంపిక అవకతవకలపై న్యాయ విచారణ చేపట్టాలి

**పలువురు స్టాల్స్ నిర్వాహకుల డిమాండ్**




**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా నిర్వహించే నాంపల్లి ఎగ్జిబిషన్ నుమాయిష్ లో స్టాల్స్ ఎంపిక అవకతవకలపై న్యాయ విచారణ చేపట్టాలని పలువురు స్టాల్స్ నిర్వాహకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు తెలంగాణ జన సమితి నాయకులతో కలిసి బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్టాల్స్ నిర్వాహకుడు అక్బర్ అలీ,గాంధీ దర్శన్ కార్యదర్శి ప్రసాద్ తో కలిసి జన సమితి గ్రేటర్ అధ్యక్షుడు నర్సయ్య మాట్లాడారు. నుమాయిష్ లో మొత్తం 3 వేలకు పైగా స్టాల్స్ ఏర్పాటు చేస్తే, అధికారిక లెక్కల్లో మాత్రం 2 వేల స్టాల్స్ మాత్రమే చూపిస్తున్నారని తెలిపారు.మిగిలిన 15 వందల స్టాల్స్ ను ఏ పద్దతిలో కేటాయిస్తున్నారో బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సొసైటీ లెక్కల ప్రకారం మినిమం స్టాల్ కు లక్ష రూపాయల రెంట్ ఉంటుందని కానీ ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు అదనంగా రెండు నుండి మూడు లక్షల వసూలు చేస్తున్నారని ఆరోపించారు.స్టాల్స్ కేటాయింపు కూడా పారదర్శకంగా జరపడం లేదని కేవలం కొన్ని స్టాల్స్ కు మాత్రమే బహిరంగ వేలం వేస్తున్నారని పేర్కొన్నారు.మిగిలిన స్టాల్స్ కు వారిని నచ్చిన వాళ్లకు ఇష్టమైన ధరలకు కేటాయిస్తున్నారని విమర్శించారు.గత ఏడాది సొసైటీ కన్వీనర్ ప్రస్తుత స్టాల్స్ అలట్మెంట్ అడ్వైజర్ ప్రభ శంకర్ కనుసన్నల్లోనే అవకతవకలు జరుగుతున్నాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్టాల్స్ కేటాయింపు పై ఒక కమిటీ వేసి విచారణ జరిపించాలని అప్పుడే సొసైటీ చేస్తున్న అక్రమాలు బయటపడతాయన్నారు.స్టాల్స్ కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరుగుతుందని గోషామహల్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు స్టాల్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ విషయం ఐటీ శాఖ మంత్రి,సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లామని, సొసైటీ సభ్యుల అవినీతి త్వరలోనే బయటపడుతుందని నర్సయ్య అన్నారు. గాంధీ దర్శన్ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో ఉన్న గాంధీ దర్శన్ బిల్డింగ్ ను ఎగ్జిబిషన్ సొసైటీ అక్రమించుకుందని అన్నారు.గాంధీజీకు సంబంధించిన వస్తువులను బయట పడేసి,గాంధీ దర్శన్ బిల్డింగ్ ను కూడా స్టాల్స్ కు కేటాయించి మహాత్మా గాంధీని అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఎలికట్ట గ్రామంలో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ప్రభుత్వ సారెగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని ఎలికట్ట సర్పంచ్ నవకిరణి అన్నారు.ఫరుక్ నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో ఉప సర్పంచ్ జి అభినవ్ గ్రామ నాయకుల ఆధ్వర్యంలో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తారని అన్నారు. అందులో భాగంగా మహిళలకు ఉద్దేశించిన అనేక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్నదని ఇప్పటికే మహిళలకు, ఇందిరమ్మ ఇండ్లు,ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సదుపాయం కల్పించిందని ఆయన అన్నారు.గృహజ్యోతి కింద 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్,500 రూపాయల గ్యాస్ సబ్సిడీ మంజూరు చేస్తుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో,గ్రామ పంచాయతీ సెక్రటరీ తేజస్విని,మాజీ ఎంపీటీసీ శ్రీశైలం,నరసింహ,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు సారెగా ఇందిరమ్మ చీరలు



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ప్రభుత్వ సారె ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని హాజిపల్లి సర్పంచ్ మాల కుమార్ అన్నారు.ఫరుక్ నగర్ మండలంలోని హాజిపల్లి గ్రామంలో ఉప సర్పంచ్ ఇస్నాతి గంగాధర్ మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని అన్నారు. అందులో భాగంగా మహిళలకు ఉద్దేశించిన అనేక పథకాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే అమలు చేస్తున్నదని ఇప్పటికే మహిళలకు, భేటీ పడావో బేటి బచావో,ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇందిరమ్మ ఇండ్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సదుపాయం కల్పించిందని ఆయన అన్నారు.గృహజ్యోతి కింద 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ,మంజూరు చేస్తుందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో,ఉప సర్పంచ్ ఇస్నాతి గంగాధర్,రాజు, ఉపేందర్,తదితరులు మహిళలు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు

# చకచకా సాగుతున్నాయి

### ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి జర చూడండి

### ఫరూక్ నగర్ మాజీ జెడ్పిటిసి పి.వెంకట్ రాం రెడ్డి

### మీడియాకు నిర్మాణ పనుల వీడియో విడుదల





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**నియోజకవర్గంలోని కొందుర్గు మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం పనులు చక చక కొనసాగుతున్నాయని ఫరూక్ నగర్ మాజీ జెడ్పిటిసి,కాంగ్రెస్ నాయకుడు పి వెంకట్రాంరెడ్డి పేర్కొన్నారు. పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి శాసనమండలిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు జరగడంలేదని పనులు ప్రారంభించలేదని ప్రశ్నించారని వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదని వెంకటరామిరెడ్డి హితవు పలికారు. పనులు ఏనాడూ ప్రారంభం అయ్యాయని ఒక్కసారి వచ్చి చూస్తే తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతంలో మొట్టమొదట ఇంటిగ్రేటెడ్ పాఠశాలను స్వాహస్తాలతో ప్రారంభించారని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో దాదాపు 250 కోట్ల రూపాయల విలువైన ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి కసరత్తు చేస్తుందని పనులు చురుకుగా కొనసాగుతున్నాయని వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు.పనులు ప్రారంభించాలని శాసనమండలిలో అర్ధరహితంగా మాట్లాడడం సరికాదని ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి సూచించారు.ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పాఠశాల నిర్మాణం పనుల వీడియోలు విడుదల చేశారు.

## ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో బిఆర్ఎస్

### గట్టిగా తిప్పి కొట్టాలన్న సిఎం రేవంత్

హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,:** భారత రాష్ట్ర సమితి తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రులతో సీఎం భేటీ సందర్భంగా సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సమాయత్తం కావాలన్నారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని సూచించారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ ముఖ్యం అన్నారు. ప్రతిపక్షం అడిగే ప్రతీ అంశానికి సమాధానం ఇవ్వాలన్నారు. జనవరి 4 వరకు సభ జరిగే అవకాశం ఉందన్నారు. మరోవైపు స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బీఏసీ సమావేశం ప్రారంభమైంది. దీనికి మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, భాజపా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ హాజరయ్యారు. ఈ సమావేశంలో అసెంబ్లీ పని దినాలు, అజెండా ఖరారుపై చర్చించారు.

---------

## ఉద్యోగుల గురించి మొసలి కన్నీరు

### హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ శ్రీధర్ బాబు

హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,** తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలపై మాజీ మంత్రి హరీశ్‌రావు శాసనసభలో చేసిన వ్యాఖ్యలను మంత్రి శ్రీధర్ బాబు తిప్పికొట్టారు. ఉద్యోగుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. మొత్తం ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నట్లు హరీష్ పేర్కొన్నారు. ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలని కోరారు. పింఛన్ బకాయిలు రావట్లేదని 39 మంది విశ్రాంత ఉద్యోగులు మరణించారని హరీశ్‌రావు అన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు స్పందించారు. ఉద్యోగుల గురించి హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. సభ్యుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

--------

## బోగస్ ఏజెంట్ల మోసంలో పడవద్దు

### అసెంబ్లీలో మంత్రి పొన్నం సూచన



హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,** బోగస్ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ప్రవాసుల సమస్యలు వినేందుకు ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. గల్ఫ్ వెళ్లే కార్మికుల సమస్యలనూ పరిష్కరిస్తున్నామని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా గల్ఫ్‌లో ఉన్న తెలంగాణ ప్రజల ఇబ్బందులను పలువురు సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా.. మంత్రి పొన్నం స్పందించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా విదేశాల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో నైపుణ్యాలను బట్టి ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. టామ్ కామ్ ద్వారా మాత్రమే విదేశాలకు వెళ్లాలని సూచించిన ఆయన.. ఇందులో శిక్షణ తీసుకొని ఇతర దేశాల్లో ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని నిరుద్యోగ యువతకు విజ్ఞప్తి చేశారు. నైపుణ్యం కలిగిన యువతకు గల్ఫ్‌తో పాటు ఇతర దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టామ్‌కామ్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. గల్ఫ్ బాధితుల కోసం తెలంగాణలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఉంటే బావుంటుందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సూచించారు. అక్కడ కార్మికులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. మన ఊరు-మన బడికి నిధులు రావడం లేదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఇప్పటివరకు నెరవేర్చలేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జీహెచ్‌ఎంసీ పునర్విభజనలో కొన్ని డివిజన్లలో ఓటర్ల శాతంలో హెచ్చుతగ్గులు ఉన్నాయని.. వాటిపై ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలన్నారు.

## సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి: కూనంనేని

హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,** సింగరేణి కార్మికుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శాసనసభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. 'సింగరేణి పెద్ద పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్. పూర్తిగా ప్రైవేటుపరం అయ్యే అవకాశం కనిపిస్తోంది. సింగరేణి కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజకీయ జోక్యం పెరుగుతోందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు అదే కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబించాయి. ప్రస్తుతం కూడా అవే కొనసాగుతున్నాయి. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరముంది' అని కూనంనేని సాంబశివరావు అన్నారు. సభ్యులు మాట్లాడిన అనంతరం సభను స్పీకర్ ప్రసాద్‌కుమార్ జనవరి 2వ తేదీకి వాయిదా వేశారు.

# గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన నాగవెల్లి ప్రాహ్య



**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
గచ్చిబౌలి స్టేడియం శనివారం అపురూప దృశ్యానికి వేదికైంది. భరతనాట్య కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహత్తర ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. శాస్త్రీయ నృత్య సంప్రదాయానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేలా ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.
ఈ ప్రదర్శనలో విశేష ప్రతిభ కనబరిచిన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అబ్బిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నాగవెల్లి ప్రాహ్య (తండ్రి: రమేష్) గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించి అరుదైన గౌరవం పొందారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా నాగవెల్లి ప్రాహ్యకు గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందజేశారు...గ్రామస్థాయి నుంచి ప్రపంచస్థాయికి ఎదిగిన ఈ విజయం సూర్యాపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. శాస్త్రీయ నృత్యాలపై ఆసక్తి ఉన్న యువతకు ఈ ఘనత ప్రేరణగా నిలుస్తూ, భారతీయ సాంస్కృతిక వారసత్వం విలువను ప్రపంచానికి చాటిచెప్పిందని పలువురు ప్రశంసించారు.



Bharath Arts Academy®
Cherish The World With Arts
In Collaborations with Govt. of Telangana
Kuchipudi Kala Vaibhavam
Largest Kuchipudi Dance Lession
AN ATTEMPT TO REGISTER IN OFFICIAL ATTEMPT GUINNESS WORLD RECORDS
Certificate of Participation
This is to certify that Prahya Nagavelli has proudly participated in Kuchipudi Kala Vaibhavam-2 an attempt to register in Guinness World Records Program organised by Bharath Arts Academy and held on 27th December 2025, showcasing enthusiasm, discipline, and dedication. Your active involvement in this historic event reflects your commitment to excellence and cultural pride. We appreciate your spirited participation and congratulate you for being a part of this remarkable achievement.
visista
Gold and Diamonds
JUBILEE HILLS | KOTHAPET
Date : 27th December 2025
Venue : Gachibowli, Hyderabad
Smt. Lalitha
Founder - President
Bharath Arts Academy

# డబ్బుల కోసమే జీహెచ్ఎంసీ డీలిమిటేషన్

### అడ్డగోలుగా విభజించి పడేశారు -బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ

**హైదరాబాద్,,డిసెంబర్ 29ప్రజావినికిడి,**
జీహెచ్ఎంసీని అడ్డగోలుగా విభజించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జీహెచ్ఎంసీ డీలిమిటేషన్ కేవలం డబ్బుల కోసం చేస్తున్నదనే అని అన్నారు. మర్చంట్ బ్యాంకర్ బ్రోకర్ చెప్పినట్లుగా రేవంత్ రెడ్డి చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీని మూడు ముక్కలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫోర్త్ సిటీ అని పెట్టాడని.. దాన్ని కూడా తొందరలో ఏదో కార్పొరేషన్ చేస్తాడు కావచ్చని ఎద్దేవా చేశారు. ఏం చేసినా శాస్త్రీయంగా ఉండాలని.. కానీ ఇష్టమొచ్చినట్లు చేస్తే ఊరుకోరని తెలిపారు. వీటన్నింటికీ సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ డివిజన్ల విభజనపై సభలో చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. చర్చలో అన్ని విషయాలపైనా తాము మాట్లాడతామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీలో



కాంగ్రెస్, ఎంఐఎం ఏం చే?కుంటారో.. ఎవరికి లాభం చేకూర్చేలా చేసుకుంటారో వాళ్లిష్టమని అన్నారు. కానీ తమకు మాత్రం 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నిక చారిత్రాత్మక ఎన్నిక అని తెలిపారు. అలాంటి ఎన్నికలు ఇప్పటివరకు చూడలేదని.. మళ్లీ చూడబోమని చెప్పారు. గతంలో ఓల్డ్ సిటీలో కూడా బీఆర్ఎస్ రెండు సీట్లు గెలిచామని గుర్తుచేశారు. గతంలో మేం గెలిచిన సీట్లు ఇంకా ఎవరు గెలవలేరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి షేక్‌హ్యాండ్ ఇవ్వడంపైనా కేటీఆర్ స్పందించారు. కేసీఆర్ అంటే గౌరవం ఉంటే చాలని అన్నారు. తెలంగాణ తెచ్చిన నాయకుడివగా కేసీఆర్ పట్ల తెలంగాణలో ప్రతి ఒక్కరికీ గౌరవం ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రికి సభలో కేసీఆర్‌ను కలిసేంత సంస్కారం ఉంటే చాలని.. ఇదే సంస్కారం బయట మాటల్లో కూడా ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. రాజకీయ ప్రత్యర్థులు ఒకరినొకరు పలకరించుకునేంత సానుకూల వాతావరణం ఉంటే మంచిదేనని అన్నారు.

# పాలమూరుకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం

### పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్లక్ష్యం

### డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు

### పైగా 90శాతం పనులు పూర్తయ్యాయనే దుష్ప్రచారం

### సాగునీటి జలాలపై చర్చలో మండిపడ్డ మంత్రి ఉత్తమ్



హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన తీరుపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు బీఆర్ఎస్ హయాంలో తీరని అన్యాయం జరిగిందని, ఇప్పుడు తమ ప్రభుత్వంపై బురద జల్లడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాగునీటి జలాలపై చర్చ జరిగింది. చర్చలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు.ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ చేతకానితనాన్ని మంత్రి ఎండగట్టారు. 2015లో ఈ ప్రాజెక్టు కోసం జీవో జారీ చేసినప్పటికీ, కేంద్ర జల సంఘానికి డీపీఆర్ సమర్పించడానికి నాటి ప్రభుత్వానికి ఏడేళ్ల మూడు నెలల సమయం పట్టిందని ఎద్దేవా చేశారు. ఆశ్చర్యకరంగా, డీపీఆర్ ఆమోదం పొందకముందే రూ. 20,641 కోట్లు ఖర్చు చేశారని, ఇది వారి పాలనలోని అస్తవ్యస్త విధానాలకు నిదర్శనమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్ష కోట్లు ఖర్చు పెట్టి, దాని సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచిన కేసీఆర్.. పాలమూరు రంగారెడ్డి విషయంలో మాత్రం వివక్ష చూపారని ఉత్తమ్ ఆరోపించారు. పాలమూరు సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 1 టీఎంసీకి తగ్గించారని దుయ్యబట్టారు. అంతేకాకుండా, ప్రాజెక్టు పనులను ఉద్దేశపూర్వకంగానే నెమ్మదిగా చేయాలని నాటి రాజకీయ పెద్దలు అధికారులకు ఆదేశాలు ఇచ్చారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే నాటికి 90 శాతం పనులు పూర్తయ్యాయని ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. అసలు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 70,000 కోట్లకు పైగా ఉంటే, బీఆర్ఎస్ హయాంలో జరిగింది కేవలం రూ. 27,000 కోట్ల పనులు మాత్రమే. ఇది 90 శాతం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా వంటి వాటిని కూడా తొమ్మిదిన్నరేళ్లలో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ ఎన్ని ఆటంకాలు సృష్టించినా, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును తమ ప్రభుత్వం 90 టీఎంసీల సామర్థ్యంతోనే పూర్తి చేసి తీరుతుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు తాము అధికారంలోకి వచ్చాక 11 పంపుల ఇన్‌స్టాలేషన్ పూర్తి చేశామని, ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మాజీమంత్రి హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్‌లో తానే మాస్టర్‌నని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. హరీశ్‌రావుకు అంత అహంకారం ఎందుకని ప్రశ్నించారు.

# ఉద్యోగులకు పిఆర్సి ఏమయ్యింది

### రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా దక్కడం లేదు

### హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇయ్యాల్సిన పీఆర్సీ గానీ, డీలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించిన ఒక్క రూపాయి కూడా పెండింగ్ పెట్టలేదని హరీష్ అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంమాత్రం ఉద్యోగులకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామిని కూడా నెరవేర్చలేదని హరీష్ అన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్య బాగాలేక ఎంతో మంది చనిపోయారని మాజీ మంత్రి గుర్తు చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇప్పించమని కోర్టుకు వెళ్లినా ఈ సర్కరారు వారిపట్ల కనికరం చూపించలేదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి రథ చక్రాల్లాంటివారు, వారు సంతోషంగా ఉంటేనే ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగే అవకాశముంటుందని హరీష్ అన్నారు. కానీ.. ఇవాళ ఈ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వాళ్లకు రావలిసిన బెనిఫిట్స్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. ఇవాళ రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు దేశంలో ఎక్కడాలేని విధంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా ఉద్యోగుకలకు పీఆర్సీ ఇవ్వలేదు. గతంలో కేసీఆర్ హయాంలో ఒకసారి 39, మరోసారి 43 శాతం పీఆర్సీ ఇచ్చిన విషయాన్ని హరీష్‌రావు అసెంబ్లీ వేధికగా గుర్తుచేశారు. అదేవిధంగా ఉద్యోగులకు ఈహెచ్ఎస్ (ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్)ను కూడా అమలు చేయాలని, ఉద్యోగులకు జీపీఎఫ్ తదితర బకాయిలన్నీ కూడా తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన అన్నారు. అంతేకాక, ఇవాళ రిటైరయిన ఉద్యోగులు తమకు రావలిసిన బెనిఫిట్స్ అందక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, డబ్బులు లేక సరైన వైద్యం అందక దాదాపు 39 మంది రిటైర్డ్ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సుమారు 15వేల మంది ఉద్యోగులు రిటైరైతే వారందరికీ అందాల్సిన బెనిఫిట్స్



ఒక్క రూపాయి కూడా పెండింగ్ పెట్టకుండా ఇచ్చామని హరీష్ తెలిపారు. అదేవిధంగా సీపీఎస్ పెన్షన్ స్కీమ్‌ను ఓపీఎస్‌గా మారుస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామి ఇచ్చిందని, అది ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదని, ఎప్పటిలోగా ఓల్డ్‌పెన్షన్ స్కీమును అమలు చేస్తారో చెప్పాలని హరీష్ అడిగారు. గత రెండేళ్లుగా సీపీఎస్ కింద రాష్ట్రప్రభుత్వం కట్టాల్సిన కాంట్రీబ్యూషన్ డబ్బులు కూడా కట్టకుండా వాటిని దారి మళ్లిస్తున్నారని, సీపీఎస్ కట్టకుండా, ఓపీఎస్ అమలు చేయకపోవడంతో రెండు లక్షల మంది సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, దయచేసి సీపీఎస్ కాంట్రిబ్యూషన్ కట్టమని, ఓపీఎస్‌ను త్వరగా అమలు చేయాలని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు హరీష్ అన్నారు.

# సింగూర్ ప్రాజెక్టు నుండి నీటి విడుదలపై రైతులకు స్పష్టత ఇవ్వాలి.

## లేదా క్రాప్ హాలిడే ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలి. -అయోమయంలో ఉన్న రైతంగం

## పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం. -మాజీ డిప్యూటీ స్పీకర్ ఏం పద్మ దేవేందర్ రెడ్డి.

### కలెక్టర్ రాహుల్ రాజ్ కు ప్రజావాణిలో వినతి పత్రం





**మెదక్ డిసెంబర్ 29ప్రజావినికిడి,**
సింగూర్ నీటి విడుదలపై రైతులకు స్పష్టత ఇవ్వాలని, లేదా క్రాప్ హాలిడే ప్రకటించి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులతో
మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పద్మదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ...సింగర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ ఆయకట్టకు నీటి విడుదలపై ప్రభుత్వం ఎలాంటి అధికారికంగా ప్రకటన చేయకపోవడంతో అయోమయంలో జిల్లా రైతంగం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సింగూర్ నుండి ఘనపూర్ ఆయకట్టకు నీటిని విడుదల చేయిస్తారా, లేదా క్రాప్ హాలిడే ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బిఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తే ఘనపూర్ ఆయకట్ట కింద పంటలు సాగుతాయని, ప్రభుత్వం ఇప్పటికీ సింగూర్ నీల విషయంలో అధికారికంగా ప్రకటన చేయకపోవడం రైతులను అయోమయానికి గురి చేస్తుందని ప్రభుత్వం మొండి వైఖరి తాగదని ఎదవ చేశారు. బిఆర్ఎస్ అయంలో ప్రతి పంటకు నీళ్లు ఇచ్చి పంట కూడా కొన్న ఘనత కేసీఆర్ గారిది అని అన్నారు. సింగూర్ నుండి నీళ్లను హైదరాబాద్కు తీసుకెళ్లకుండా రతన్య చర్యలు ఏర్పాటు చేసి,మెదక్ జిల్లాకె సింగ్ నీళ్లు అంకితం చేసింది కేసీఆర్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు తీవ్ర నష్టం ఏర్పడుతుందని మండిపడ్డారు. వానకాలం జరిగిన నష్టపరిహారం ఇప్పటివరకు రైతులకు చెల్లించలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సింగూర్ నుండి నీటిని విడుదల చేస్తారా లేదా క్రాఫ్ హాలిడే ప్రకటించి రైతులకు నష్టపరిహారం చెల్లిస్తారా అనే విషయమై ప్రభుత్వాన్ని మీ ద్వారా కోరుతున్నామని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు.లేనియెడల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్, మాజీ ఎంపీపీలు కొత్తపల్లి కిష్టయ్య,దుర్గయ్య, మాజీ రైతుబంధు జిల్లా అధ్యక్షులు సోములు,మాజీ కౌన్సిలర్లు విశ్వం, మాయ మల్లేశం చంద్రకళ,సోహెల్, పట్టణ పార్టీ కోకన్వీనర్లు కృష్ణ గౌడ్ లింగారెడ్డి, సర్పంచ్ లు సాంబశివరావు, మ్యాకల. సాయిలు,పాపన్నపేట్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి
నాయకులు కండెల. సాయిలు, ఏనుగుల.రాజు,మెడిశెట్టి. శంకర్
బట్టి.ఉదయ్,రామచంద్ర రెడ్డి మోహన్ నాయక్ శ్రీనాథ్ రావు, సంగమేశ్వర్, బద్రి. మల్లేశం,మాజీ సర్పంచ్ లు, మెదక్ పట్టణం, మెదక్, హవెలిఘనపూర్, పాపన్నపేట మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్ పర్సన్‌గా రోష్ని అపరాంజి



విశాఖపట్టణం,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్ పర్సన్‌గా మహిళా ఐఏఎస్ అధికారి రోష్ని అపరాంజి కోరాటి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ పోర్టులో ఈ పదవిని చేపట్టిన తొలి మహిళా ఐఏఎస్ అధికారి కావడం విశేషం. విశాఖ పోర్టు అథారిటీకి డిప్యూటీ చైర్‌పర్సన్‌గా నియమితులవడానికి ముందు డిప్యుటేషన్‌పై విశాఖ స్పెషల్ ఎకనామిక్ జోన్ లో జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2018లో ప్రజా పరిపాలనలో విశిష్ట సేవలకుగాను ప్రధాని అవార్డు సహా అనేక పురస్కారాలు అందుకున్నారు.అస్సాం-మేఘాలయ కేడర్‌కు చెందిన ఆమె తన విద్యాభ్యాసమంతా విశాఖలోనే పూర్తి చేశారు. ఆమె తండ్రి విశాఖపట్నం పోర్టు హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారు. తండ్రి సేవలు అందించిన సంస్థకు కుమార్తె డిప్యూటీ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. ఏప్రిల్ 3, 1984లో జన్మించిన రోష్ని.. ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్‌లో మాస్టర్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో ఆమెకు విస్తృత పరిపాలనా అనుభవం ఉంది. అస్సాంలోని జోర్హాట్ జిల్లాకు అదనపు ఉప కమిషనర్‌గా, అదే జిల్లాకు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌గా సేవలందించారు.

----------------

## ప్రాణాంతకంగా చైనా మాంజా

### చైనా మాంజా తగిలి యువకుడి గొంతుకు గాయం

హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**హైదరాబాద్ నగరంలో చైనా మాంజా ఆందోళన కలిగిస్తోంది. చైనా మాంజాలు ప్రాణాలు తీస్తున్నాయనే కారణంతో దాని వాడకంపై ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం, నిఘా లేకపోవడం వల్ల దానిని అందరూ యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. చాలా తక్కువ ధరకే దొరుకుతుండడంతో అందరూ పతంగులు ఎగరేయడానికి చైనా మాంజానే వినియోగిస్తున్నారు. అయితే ఇది చాలా మంది ప్రాణాలు తీస్తోంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక వ్యక్తి చైనా మాంజా వల్ల గొంతు కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు . తాజాగా మరో వ్యక్తి చైనా మాంజా వల్ల తీవ్ర గాయాలపాలయ్యాడు. హైదరాబాద్ పాతబస్తీ నవాబ్ సాబ్ కుంటకు చెందిన జమీల్ అనే యువకుడు చార్మినార్ వైపు బైక్ వెళుతున్నాడు. శంషీర్ గంజ్ ప్రాంతంలో చైనా మాంజా అతడి గొంతుకు తగిలి కోసుకు పోయింది. దీంతో అతడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

## తిరుమలలో భారీగా ఏర్పాట్లు

### మరోమారు పరిశీలించిన చైర్మన్

తిరుమల,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుమలలో ఉత్తర ద్వార దర్శనానికి తితిదే విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. వేకువజామునే వివిఐపిల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.నేటి నుంచి శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా



తిరుమలకు రానున్నారు. ఈ నేపథ్యంలో తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. తితిదే సీవీఎస్వో, జిల్లా ఎస్పీ, చీఫ్ ఇంజినీర్, పలు విభాగాల అధికారులు బీఆర్ నాయుడు వెంట ఉన్నారు. శిలాతోరణం, కృష్ణతేజ, ఏటీజీహెచ్ క్యూలైన్ ఎంట్రీ పాయింట్స్ వద్ద క్షేత్రస్థాయిలో సదుపాయాలను వారు పరిశీలించారు. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో 1.89 లక్షల టోకెన్లను ఈ-డిప్ ద్వారా తితిదే కేటాయించింది. టోకెన్లు ఉన్న భక్తులకే ఆ మూడు రోజుల్లో దర్శనం కల్పించనున్నారు. ఎంట్రీ పాయింట్స్ వద్ద టోకెన్ స్కానింగ్ ప్రక్రియను చైర్మన్‌కు అధికారులు వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ తలెత్తకుండా క్యూలైన్ నిర్వహించాలని బీఆర్ నాయుడు అధికారులకు సూచించారు.

## సాయిబాబా దేవుడు కాదంటూ ప్రచారం

### సినీనటి మాధవీలతకు బిగ్ షాక్

### సరూర్‌నగర్ పోలీసుల కేసు నమోదు

హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,** ప్రముఖ సినీనటి మాధవీలతకు బిగ్ షాక్ తగిలింది. ఆమెపై సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోషల్ మీడియాలో సాయిబాబా దేవుడు కాదని తప్పుడు ప్రచారాలు, వ్యాప్తి చేసినందుకు మాధవీలతపై కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... నటి మాధవీలతతో పాటు, ఈ ప్రచారానికి పాల్పడిన పలువురు యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కూడా ఈ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారు పెట్టిన పోస్టు వల్ల ప్రజల భావోద్వేగాలకు నష్టం జరిగిందని ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మాధవీలతతో పాటు మిగతా యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సరూర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులోని ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో వారి సోషల్ మీడియా ఖాతాలపై నిఘా పెట్టినట్లు సమాచారం. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఎపిలో మందుబాబులకు శుభవార్త

### రాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయాలు

అమరావతి,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మద్యం విక్రయాలు, సేవల సమయాలను పొడిగించేందుకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి అనుమతి మంజూరు చేశారు. ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్ సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రత్యేక అనుమతుల ప్రకారం.. డిసెంబర్ 31 మరియు జనవరి 1 రాత్రుల్లో మద్యం దుకాణాలు అర్ధరాత్రి 12 గంటల వరకు విక్రయించవచ్చు. అలాగే బార్లు, (ఇన్-హౌస్) లైసెన్సులు కలిగిన ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థలకు రాత్రి 1 గంట వరకు మద్యం విక్రయాలు, సర్వీస్‌కు అనుమతి ఇచ్చారు. గత ఏడాది నూతన సంవత్సరం సందర్భంగా అమలు చేసిన విధానాన్నే ఈ ఏడాదీ కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల అమలుకు ఎక్సైజ్, ప్రొహిబిషన్ డైరెక్టర్, ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్లు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది.

---------

# కెసిఆర్ మాటలకు చింతకాయలు రాలేనా ?

**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
మాటలకు చింతకాయలు రాలుతాయా అంటే..రాలుతయానే అంటారు మాజీ సిఎం కెసిఆర్. ఎందుకంటే ఆయన మాటలతోనే పదేళ్లపాటు ఓట్లు రాల్చుకున్నారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రయోగానికి సిద్ధం అవుతు న్నారు. రెండేళ్లుగా ఫాంహౌజ్‌కే పరిమితమైన కేసీఆర్ ఇకపై తోలు తీయడానికి తానే స్వయంగా రంగం లోకి దిగబోతున్నట్టు ప్రకటించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఇంతకాలం విపక్షనేతగా ఆయన విఫలం అయ్యారు. తోలు తీయడానికి ముందు గత 9 ఏళ్ల పాపాల గురించి ప్రశ్నిస్తున్న వారికి సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేది. ధరణి,ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం అక్రమాలు, ఇ- కార్ రేసింగ్ తదిరఅ వినతి కేసులు చాలానే ఉన్నాయి. వీటికి సమాధానం చెప్పడం లేదు. పైగా కెసిఆర్ కొడుకు లొట్టపీసు కేసులని బెదిరింపులకు దిగారు. ఏతావాతా రాజకీయ నేతల భాష జుగప్సాకరంగా మారింది. ఉన్నట్టుండి తెలంగాణ రాజకీయాలలో తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ ప్రయత్నించడం కేవలం రాజకీయంగా మళ్లీ పట్టు సాధించేందుకే తప్ప మరోటి కాదు. మళ్లీ నీళ్లు,నిధులు, నియామకాలు అంటూ నినదిస్తానని ప్రకటించినట్లు సమాచారం. తెలంగాణ ఏర్పడి పన్నెండేళ్ల తరవాత ఇంకా తెలంగాణ సెంటిమెంట్‌తో ఆడుకునే వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలి. తెలంగాణపై బీఆర్ఎస్‌కు మాత్రమే పెటెంట్ ఉన్నట్లుగా బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారు. తమ హయాంలో పదేళ్ల మోసాలపై మాత్రం మాట్లాడడం లేదు. ఇదంతా కేవలం రాజకీయ డ్రామా అని మాత్రం ప్రజలకు కూడా తెలుసు. వరుస ఓటములతో బిఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. కంటోన్మెంట్,జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఓటమితో పాటు, పంచాయితీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఆధిక్యం చాటింది. దీంతో ఇక కెటిఆర్‌తో లాభం లేదనుకున్నాడేమో ..కెసిఆర్ స్వయంగా రంగంలోకి దిగుతానని ప్రకటించారు. గతకొంతకాలంగా బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులు ఇదే ప్రకటిస్తూ వస్తున్నారు. మరోవైపు కూతురు కవిత జనంజాగృతి బాటతో బిఆర్ఎస్ నాటి పాలనా వైఫల్యాలను తూర్పారాబడుతున్నారు. ఆనాడు జరిగిన తప్పిదాలకు క్షమాపణలు కోరుతున్నారు. అభివృద్ధి, బంగారు తెలంగాణ పేరుతో జరిగిన ప్రచారమంతా డొల్ల అని ఆమె కళ్లముందే కనిపిస్తుంటే.. వలపోస్తున్నారు. ఇప్పటి వరకు ఎన్నికలు ఎప్పుడు జరిగినా తాము అధికారంలోకి వచ్చినట్టేనని భారత రాష్ట్ర సమితి నాయకులు కలలుకంటూ వచ్చారు. గత ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. అధికార కోల్పోయాక జరిగిన తర్వాత వచ్చిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం, సర్పంచ్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించడంతో సిఎం



రేవంత్ రెడ్డి రెట్టించిన ఉత్సాహంతో కెసిఆర్‌పై విరుచుకు పడుతున్నారు. అసెంబ్లీకి రా తేల్చుకుందామని, చర్చిద్దామని సవాళ్లు విసరుతున్నారు. ఇప్పుడు కూడా మౌనంగా ఉంటే బాగుండ దనో ఏమో కెసిఆర్ ..సై అంటూ సవాళ్లు విసిరారు. అందుకే కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను రేవంత్‌రెడ్డి వదులుకోవడానికి సిద్ధపడడం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లాకు అన్యాయం చేస్తున్నారని సరికొత్త వివాదాన్ని తెర మీదకు తెచ్చారు. చంద్రబాబుతో కుమ్మక్కయి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు ద్రోహం చేస్తున్నారని కేసీఆర్ వాదన మొదలు పెట్టారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు రాజకీయంగా అవసరం వచ్చినప్పుడల్లా చంద్రబాబు బూచి చూపడం కెసిఆర్‌కు అలవాటుగా మారింది. 2018లో చంద్రబాబును బూచిగా చూపించి బొడ్లో కత్తిపెటుటుకుని తిరుగుతున్నాడని ప్రచారం చేశారు. కేసీఆర్ ప్రచారం ఫలించి రెండవ పర్యాయం అధికారంలోకి వచ్చారు. 2023 ఎన్నికల్లో అది పనిచేయలేదు. దీంతో ఇప్పుడు నీళ్ల విషయంలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణకు, ముఖ్యంగా మహబూబ్‌నగర్
జిల్లాకు అన్యాయం చేస్తున్నారని కొత్త పల్లవితో సభలు పెట్టేందుకు సిద్దం అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ వాసి అయినందున ఆయన తన సొంత జిల్లాకు అన్యాయం చేసుకుంటారని ఎవ్వరు కూడా అనుకోరు. చంద్రబాబుతో కుమ్మక్కు అవుతారనడానికి ఆధారాలు లేవు. ఏ రాజకీయ నాయకుడైనా సొంత ప్రాంత ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలు చేస్తారని అనుకోవడానికి లేదు. అందులోనూ కెసిఆర్‌ను ఇక అధికారంలోకి రానివ్వనని శపథం కూడా చేశారు. పాలమూరు రంగారెడ్డిపై చర్చకు సిద్దమని సవాల్ విసిరారు. అందుకేనేమో కెసిఆర్ కూడా ప్రస్తుతానికి ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారు. నీటి అంశాలపై ప్రజలు వెంటన స్పందిస్తారి అనుకుని ఉంటారు. ప్రజల్లో సెంటిమెంటును రగిలించడానికి ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు పెట్టాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టుగా కనిపిస్తోంది. ఉంది. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఫ్యూచర్ సిటీలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైజింగ్ సమ్మిట్ నిర్వహించడాన్ని ఎగతాళి చేసారు. నిజానికి తాను ద్వేషించే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని జీర్ణించుకోలేకనే రెండేళ్లుగా ఫామ్‌హౌజ్‌కు పరిమితం అయ్యారు. అసెంబ్లీకి కూడా రాకుండా పోయారు. తన దృష్టిలో అల్పుడైన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం కెసిఆర్ సహా బిఆర్ఎస్ శ్రేణులకు ఇప్పటికీ మింగుడు పడడం లేదు. దీనికితోడు సొంతంగా వ్యూహాలతో కాంగ్రెస్‌కు బలం చేకూరుస్తున్నారు. రాజకీయంగా తాను చేసిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి కెసిఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు.పొరపాట్లను గుర్తించి సరిదిద్దుకుంటారని అనుకుంటే అలా జరగడం లేదు. అందుకే ప్రజలను మోసం చేసి రేవంత్‌రెడ్డి అధికారం లోకి వచ్చారని ప్రచారం చేస్తున్నారు. ఉద్యమ సమయంలో ప్రజల్లో ఉండే భావోద్వేగాలు ఎల్లకాలం ఉంటాయని ఇంకా కేసీఆర్ నమ్ముతున్నారు. అందుకే కృష్ణాజలాల పేరుతో రాజకీయానికి పావులు కదుపుతున్నారు. రాజకీయాల్లో అతిశయంతో పనిచేస్తే ఓటమి తప్పదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులగా విస్మరించారు. ఇప్పుడు ప్రజలకోసం అని బయలుదేరితే ప్రజలు నమ్ముతారని అనుకోవడం కెసిఆర్ మూర్ఖత్వమే అవుతుంది.

------------

# ముక్కోటి ఏకాదశి అత్యంత పవిత్రం

## వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచే రోజు -30న ముక్కోటి ఏకాదశి పర్వదినం



తిరుమల, **డిసెంబర్ 29ప్రజావినికిడి,**
ఏడాదికి 24 ఏకాదశులు వస్తాయి. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణం వరకు జరిగే 'మార్గం' మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్ళు తెరుచుకొని ఉంటాయని వైష్ణవాలయాలలో గల ఉత్తర ద్వారం దగ్గర భక్తులు తెల్లవారుజామునే భగవద్దర్శనార్థం వేచి ఉంటారు. ఈ రోజు మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా చెబుతారు. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం, అమృతం రెండూ పుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడు. మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉపదేశించాడని విశ్వాసం ఉంది. ఈ రోజున వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవచనాలు, ప్రసంగాలు ఉంటాయి. ఈ రోజున ముఖ్యమైనవి ఉపవాసం, జాగరణ. అటు తర్వాత జపం, ధ్యానం. విష్ణుపురాణం ప్రకారం ఇద్దరు రాక్షసులు తనకు వ్యతిరేకంగా ఉన్నా మహావిష్ణువు వారి కోసం తన వైకుంఠ ద్వారాలను తెరిచాడనీ, తమ కథ విని, వైకుంఠ ద్వారం గుండా వస్తున్న విష్ణు స్వరూపాన్ని చూసిన వారికి వైకుంఠం ప్రవేశం కల్పించాలనీ వారు కోరారు. అందుజేతనే ఆ రోజును వైకుంఠ ద్వారాన్ని తలపించే విధంగా వైష్ణవ ఆలయాల్లో ద్వారాలను ఏర్పాటు చేస్తారు. మామూలు రోజుల్లో దేవాలయాల ఉత్తర ద్వారాలు మూసి ఉంచుతారు. కానీ ఈ రోజు భక్తులు ఆ ఉత్తరద్వారం గుండా వెళ్ళి దర్శనం చేసుకొంటారు. తిరువతిలో కూడా ఈ రోజును వైకుంఠద్వారం పేరిట ఉన్న ప్రత్యేక ద్వారాన్ని తెరిచి ఉంచుతారు. పద్మ పురాణం ప్రకారం విష్ణువునుంచి ఉద్భవించిన శక్తి ముర అనే రాక్షసుడిని సంహరించిన రోజు వైకుంఠ ఏకాదశి. ముర అనే రాక్షసుడి దురాగతాలు భరించలేక దేవతలు విష్ణువు శరణువేడగా ఆయన వాడితో తలపడి వాడిని సంహరించేందుకు ప్రత్యేక అస్త్రం కావాలని గ్రహించి బదరికాశ్రమంలోని హైమావతి గుహలోకి ప్రవేశించాడు. అక్కడ విశ్రమిస్తున్న విష్ణువును ముర సంహరించేందుకు ప్రయత్నించగా ఆయన నుంచి ఒక శక్తి ఉద్భవించి తన కంటి చూపుతో మురను కాల్చి వేసింది. అప్పుడు విష్ణువు సంతసించి ఆమెకు ఏకాదశి అని పేరు పెట్టి వరం కోరుకోమని చెప్పాడు. ఆ రోజున ఉపవాసం ఉన్న వారి పాపాలను పరిహరించాలని ఆమె కోరింది. ధనుర్మాస శుక్ల ఏకాదశి రోజున ఉపవాసం ఉన్న వారికి వైకుంఠప్రాప్తి కలుగుతుందని విష్ణువు వరమిచ్చాడు. వైకుంఠ ఏకాదశి రోజు ముర బియ్యంలో దాక్కుంటాడని, అందుకే బియ్యంతో చేసిన ఏ పదార్థం తినకుండా ఉండాలని అంటారు. ఈ రోజున ఉపవాసం ఉంటే మిగతా 23 ఏకాదశులు ఉపవాసం ఉన్నట్టే అని విష్ణుపురాణం చెబుతోంది. ముర అంటే తామసిక, రాజసిక గుణాలకు, అరిషడ్వర్గాలకు ప్రతీక. వీటిని ఉపవాస జాగరణల ద్వారా జయిస్తే సత్వ గుణం లభించి తద్వారా ముక్తికి మార్గం ఏర్పడుతుంది. వరి అన్నంలో ముర నివాసం ఉంటాడు కనుక మందబుద్ధిని ఇచ్చిని జాగురూకతను దెబ్బతీస్తాడని అంతరార్థం. ఏకాదశినాడు ఉపవాసం ఉండి, ద్వాదశినాడు అన్న దానం చేస్తారు. ఒకరోజు భోజనం చేయక తరువాతి రోజు చేయడం వలన జిహ్వాకు భోజనం రుచి తెలుస్తుంది. గీతోపదేశం జరిగిన రోజు కనుక 'భగవద్గీత' పుస్తకదానం చేస్తారు.

### ద్వారకా తిరుమలలో ఏకాదశి ఏర్పాట్లు

**వేకువజామున 5గంటల నుంచే ఉత్తరద్వార దర్శనం**

ద
ఈనెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభం అవుతుంది. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారి దర్శనాన్ని చేసుకుంటారు. ద్వారకా తిరుమలకు ఈనెల 30వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు భారీగా తరలి రానున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీలు కూడా వచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది స్వామివారి గిరిప్రదక్షణ, నిజరూప దర్శనంతో పాటు ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు. స్వామివారి గిరి ప్రదక్షణ ఈనెల 29వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానుంది. ఆలయ మొదటి మెట్టు వద్ద నుంచి ఈ ప్రదక్షణ మొదలుకానుంది. గిరి ప్రదక్షణ ఆలయం నుంచి సుమారు 5 కిలోమీటర్ల దూరం వరకు కొనసాగుతుంది. గిరి ప్రదక్షణ నేపథ్యంలో భక్తులు స్వామి వారి ఆలయం చుట్టూ పాదయాత్ర చేస్తారు. ఆలయంలో స్వామి వారి నిజరూప దర్శనం ఈనెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఉండనుంది. ఈ క్రమంలో భక్తులు స్వామి వారి పూజా అర్చనలో పాల్గొని నిజరూపాన్ని ప్రత్యక్షంగా దర్శించుకునే అవకాశాన్ని ఆలయ అధికారులు కల్పిస్తారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

# అమెరికాలో రోడ్డు ప్రమాదం

## గార్లకు చెందిన ఇద్దరు యువతుల దుర్మరణం



మహబూబాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,)**అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. ఘాట్‌రోడ్డులో జరిగిన కారు ప్రమాదంలోఇద్దరు యువతులు దుర్మరణం చెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన పులఖండం మేఘనారాణి (25), ముల్కనూరుకు చెందిన కడియాల భావన (24) మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఎమ్మెస్ పూర్తిచేసి ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. మేఘన, భావన సహా మొత్తం 8 మంది స్నేహితులు రెండు కార్లలో కాలిఫోర్నియాలో టూర్‌కి బయల్దేరారు. ఈ క్రమంలో అలబామా హిల్స్ రోడ్డులో మలుపు వద్ద మేఘన, భావన ప్రయాణిస్తున్న కారు లోయలో పడింది. దీంతో వారిద్దరూ మృతిచెందారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. యువతుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీం జోక్యం

## కుల్దీప్ సింగ్ సెంగార్‌కు బెయిల్ రద్దు చేస్తూ ఉత్తర్వులు



న్యూఢిల్లీ, **డిసెంబర్ 29ప్రజావినికిడి,**ఉన్నావ్ అత్యాచార కేసులో సుప్రీమ్ ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. 2017లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ అత్యాచార కేసులో.. బీజేపీ బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఇద్దరు న్యాయవాదులు సుప్రీం కోర్టులో దాఖలు చేశారు. మరోవైపు ఇదే విషయమై.. సీబీఐ కూడా సర్వోన్న న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ల వేసింది. కుల్దీప్ బయటకు వస్తే కేసుపై ప్రభావం పడే అవకాశముందని సీబీఐ పేర్కొంది. ఈ వ్యాజ్యంపై సీజేఐ సూర్యకాంత్, న్యాయమూర్తులు జేకే.మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం.. సోమవారం విచారణ చేపట్టింది. బాధితురాలి భద్రతకు సంబంధించిన అంశాలతో సీబీఐ ప్రస్తావించిన అంశాలను ధర్మాసనం పరిశీలించింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఉత్తర్వులను నిలిపివేయడంతో పాటు నిందితుడు కుల్దీప్ సెంగార్‌కు నోటీసులు జారీ చేసింది. బెయిల్ రద్దు పిటిషన్‌పై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సెంగార్‌ను ఆదేశించింది.
ఉత్తర్ ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో 17ఏళ్ల ఓ బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే, నాటి బీజేపీ నేత కుల్దీప్ సెంగార్ ఈ కేసులో ప్రధాన నిందితుడిగా తేలాడు. అయితే.. ఈ కేసు విచారణలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2018లో ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టింది. ఆ తర్వాత యూపీ ట్రయల్ కోర్టు, ఢిల్లీ కోర్టులకు మారింది. 2019 డిసెంబర్‌లో కుల్దీప్ దోషిగా తేలడంతో అతనిపై జీవితఖైదు విధించింది న్యాయస్థానం. అయితే.. తాజాగా ఈ కేసులో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. సెంగార్‌కు పోక్సో చట్టం వర్తించదని.. ఢిల్లీ హైకోర్టు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

# కమ్యూనిస్టులను లేకుండా చేసే కుట్ర

## కేంద్రం తీరుపై మండిపడ్డ కూనంనేని

హైదరాబాద్,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
కమ్యూనిస్టులు లేకుండా చేయాలనే కుట్రతో కేంద్రంలోని పాలకులు యోచిస్తున్నారని, అందుకే మావోయిస్టులను సైతం డెడ్‌లైన్ పెట్టి మరీ చంపుతున్నారని సీపీఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. ప్రకృతి సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టడం దుర్మార్గంమైన చర్యని, కేంద్రంలోని మోదీ సర్కార్ ప్రజల కోసమా అదానీ, అంబానీలాంటి కుబేరుల కోసమా తేల్చాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆపరేషన్ల పేరుతో సాగిస్తున్న నిర్బంధాలపై ప్రజా తిరుగుబాటు ఉద్యమాలు తప్పవన్నారు. మతాలు, కులాల పేరుతో కాషాయం పార్టీ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తూ ప్రజల మాన, ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు. అడవుల్లో నిక్షిప్తమైన అపార ఖనిజ సంపదను కాజేసేందుకు, అధికారాన్ని అడ్డుపెట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ మావోయిస్టు నేతలను హతమార్చడం సరైంది కాదన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని చెబుతున్నప్పటికీ ఈ మారణ హోమానికి తెగబడటం పైచాచికమని, మావోయిస్టుల హత్యలపై న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

# హెచ్-1 వీసాలపై కక్ష సాధింపు ధోరణి

## అధికారంలోకి వచ్చిన ఏడాదిగా బెదిరింపులు -ట్రంప్ తీరుపై ఇంటాబయటా విమర్శలు




న్యూఢిల్లీ,**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
వీసా కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. భారత విదేశాంగశాఖ అమెరికాతో సంప్రదింపులు జరిపినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి తెలిపారు. అయితే ఇదంతా కేవలం భారత్ పట్ల ట్రంప్ అనుసరిస్తున్న వ్యతిరేక వైఖరిగానే గుర్తించాలి. ప్రజలు ఇబ్బంది పడుతున్నా, టెక్ కంపెనీలు సూచించినా ట్రంప్ వైఖరిలో మార్పు రాలేదు. డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత భారత్‌కు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. ఇప్పటి వరకు ఆయన తీసుకున్న నిర్ణయాలు అన్ని రకాలుగా భారత్‌ను కష్టాల్లో పడేశాయి. హెచ్ 1 బీ వీసాల ఫీజు భారీగా పెంచేశారు. హెచ్ 1బీ వీసా ఫీజులను ఏడాదికి 1,00,000 డాలర్ల వరకు పెంచారు. హెచ్ 1బీ వీసాల రుసుము పెంచిన కొన్ని రోజులకు మరో దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. విదేశీ చిత్రాలపై ఏకంగా 100 శాతం టారిఫ్‌లు విధించారు. అమెరికాలో భారతీయ సినిమాలకు మంచి ఆదరణ ఉంటుంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయంతో భారత చిత్ర పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడింది. ఇంతటితో ట్రంప్ కక్ష సాధింపు చర్యలు ఆగలేదు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే బియ్యంపై 50 శాతం టారిఫ్‌లు విధించారు. ఒకరకంగా చెప్పాలంటే 2025లో భారత్, అమెరికాల మధ్య సంబంధం టారిఫ్‌ల వివాదంతోటే గడిచిపోయింది. అవకాశం ఉన్న ప్రతీ దానిపై ట్రంప్ టారిఫ్‌లు వేసేశారు. తమ దేశంతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కోపంతో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. వాణిజ్య ఒప్పందాలు చేసుకోలేదన్న కారణంతో ఆగస్టు నెలలో భారత్‌పై ఏకంగా 50 శాతం టారిఫ్‌లు వేశారు. రెండు దేశాల మధ్య చర్చలు జరిగినా ఫలితం లేకుండా పోయింది. రష్యాతో ఇండియా ఆయిల్ కొనుగోలు చేయటం ఇష్టం లేని ట్రంప్ బెదిరింపులకు దిగారు. రష్యాతో వ్యాపారం మానుకోకపోతే మరిన్ని టారిఫ్‌లు వేస్తామని హెచ్చరింరు. ఇలాంటి సమయంలో గత ఆగస్టు నెలలో ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లారు. అక్కడ మోదీ, పుతిన్, జిన్ పింగ్ కలిశారు. పలు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ముగ్గురూ కలవటంపై ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతాలో సెప్టెంబర్ 5వ తేదీన క్రిప్టిక్ మెసేజ్ పెట్టారు. డిసెంబర్ 8వ తేదీన అధ్యక్షుడు ట్రంప్ వైట్ హౌస్‌లో మాట్లాడుతూ అమెరికాలోని రైతులకోసం మల్టీ బిలియన్ డాలర్ రిలీఫ్ ఫ్యాకేజ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా భారత్, ఇతర ఆసియా దేశాలనుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులపై విమర్శలు సైతం గుప్పించారు. ఇతర దేశాలనుంచి వస్తువుల్ని అమెరికాలోకి దిగుమతి చేసుకోవటం స్థానిక ఉత్పత్తిదారులకు సవాలుగా మారిందని అన్నారు. స్థానిక ఉత్పత్తిదారులను రక్షించటం కోసం, దిగుమతులకు అడ్డుకట్ట వేయటం కోసం భారీ మొత్తంలో టారిఫ్‌లు వేస్తామని స్పష్టం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'రైతులు ఎంతో అవసరమైన జాతీయ ఆస్థి. అమెరికాకు వెన్నెముక లాంటి వారని అన్నారు. రష్యా, చైనాలను తమ దారిలోకి తెచ్చుకోవడానికి భారత్‌ను అమెరికా పావుగా వాడుకుంటోందని అమెరికాకు చెందిన రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్ తీసుకునే నిర్ణయాల వల్ల అమెరికాకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని అంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే సంబంధాలు మరింత దారుణంగా దెబ్బతింటాయని హెచ్చరిస్తున్నారు. అయితే, రెండు దేశాల మధ్య భవిష్యత్ వాషింగ్టన్, ఢిల్లీ తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటుందని చెబుతున్నారు. 2026లో అయినా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయని అమెరికన్లు కూడా ఆశగా ఉన్నారు. ముఖ్యంగా వీసా వ్యవహారాలపై సరైన నిర్యం తీసుకోకుంటే తక్షణ ఇబ్బందులు తప్పేలా లేవు.

# ఆరావళిపై ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం స్టే

## కొత్తకమిటీతో ఆరావాళిపై అధ్యయనానికి ఆదేశం



న్యూఢిలీ**డిసెంబర్ 29ప్రజావినికిడి,**
ఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ వివాదంపై సిజెఐ జస్టిస్ సూర్యకాంత నేతృత్వంలో సోమవారం విచారణ సందర్భంగా కీలక నిర్ణయం ప్రకటించింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కు తీసుకుంది. ఇటీవల ఆరావళి కొండలకు ఆమోదించిన నిర్వచనాలకు సంబంధించిన కొన్ని వివరణలు అవసరమని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది, అదే సమయంలో ఈ అంశంపై గత నెలలో జారీ చేసిన తీర్పుపై స్టే విధించింది. గతంలో అధికారులతో కూడిన కమిటీ చేసిన సిఫార్సుల పర్యావరణ ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని కోర్టు పేర్కొంది. ఆరావళి కొండల నిర్వచనంపై దాఖలైన సమస్యపై సుమోటో కేసులో కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 100 మీటర్లలోపు ఎత్తు ఉన్న ఆరావళి పర్వతాల వద్ద మైనింగ్‌కు గతంలో అనుమతులు ఇచ్చింది సుప్రీంకోర్టు. తాజాగా గతంలో ఇచ్చిన ఆదేశాలపై స్టే విధిస్తూ నేడు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణపరంగా పలు రాష్ట్రాలకు రక్షణ కవచంగా ఉన్న ఆరావళి పర్వతాలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిర్వచనానికి సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే ఈ కొత్త నిర్వచనం జాతీయస్థాయిలో దుమారం రేపుతోంది. ఈ క్రమంలో తాజాగా సుప్రీంకోర్టు స్పందించింది. గత నెల తాను ఇచ్చిన ఆదేశాలను సోమవారం నిలిపివేసింది. 'కోర్టు ఆదేశాలు, కమిటీ సిఫార్సులు నిలిపివేయడం అవసరమని మేం భావిస్తున్నాం. కొత్త కమిటీ ఏర్పాటయ్యేవరకు ఈ స్టే అమల్లో ఉంటుంది' అని ధర్మాసనం పేర్కొంది. కొత్త నిపుణుల బృందాన్ని ఏర్పాటుచేయాలని ఆదేశించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం, సంబంధిత రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది. దేశంలోనే అతిపురాతన పర్వతశ్రేణి ఆరావళి. ఇక్కడ అక్రమంగా పొందిన అనుమతులతో అడ్డగోలుగా మైనింగ్ జరుగుతోందని ఎప్పటినుంచో ఆందోళన ఉంది. ఇలాంటి సమయంలో 100 మీటర్లు... అంటే 328 అడుగుల కంటే ఎక్కువ ఎత్తున్నవి మాత్రమే పర్వతాలంటూ కేంద్రం కొత్త నిర్వచనం చెప్పింది. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించింది. దీనివల్ల హరియాణా, రాజస్థాన్, గుజరాత్, దిల్లీకి ముప్పు తప్పదని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరావళి పర్వత శ్రేణులు ఉన్న రాష్ట్రాలు కొత్తగా మైనింగ్ లీజులేవీ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిషేధం విధించింది. గుజరాత్ నుంచి జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) వరకూ విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణుల సమగ్రతను పరిరక్షించేందుకు, గనుల అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్న సంగతి తెలిసిందే. విచారణ సందర్భంగా తాత్కాలిక దరఖాస్తుదారుల ప్రవర్తనపై సీజెఐ తీవ్ర అసంతృప్తి చెందారు. ఆరావళి పర్యతాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, పర్యావరణ ముప్పునకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని కమిటీకి సూచించింది. ఈ కేసును జనవరి 21న వివరణాత్మకంగా విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

# ఇక చాలు, పోయి రంజీ జట్టుకు కోచ్‌గా పనిచేయ్



మాంటీ పనేసర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. గంభీర్ అభిమానులు ఆయనకు మద్దతుగా నిలుస్తుండగా, విమర్శకులు మాత్రం పనేసర్ చెప్పింది నిజమేనని అంటున్నారు. ఏది ఏమైనా, రాబోయే టెస్ట్ సిరీస్‌లలో గంభీర్ తన వ్యూహాలతో జట్టును గెలిపించి విమర్శకుల నోళ్లు మూయించాల్సి ఉంది. ఇక చాలు, పోయి రంజీ జట్టుకు కోచ్‌గా పనిచేయ్.. గంభీర్‌పై మాజీ ప్లేయర్ షాకింగ్ కామెంట్స్.. టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పదవి చేపట్టినప్పటి నుంచి జట్టు ప్రదర్శనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మెరుగ్గా ఉన్నప్పటికీ, టెస్టుల్లో వరుస ఓటములు గంభీర్ కోచింగ్ సామర్థ్యంపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ గంభీర్‌కు ఒక వింతైన సలహా ఇచ్చారు. గంభీర్ ముందుగా రంజీ జట్టుకు కోచింగ్ ఇచ్చి రెడ్-బాల్ క్రికెట్‌పై పట్టు సాధించాలని ఆయన సూచించారు. టెస్టుల్లో ఎదురుదెబ్బలు. గౌతమ్ గంభీర్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్ 0-3తో వైట్‌వాష్‌కు గురైంది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా పర్యటనలో కూడా భారత్ టెస్ట్ సిరీస్‌ను కోల్పోయింది. ఈ ఓటముల నేపథ్యంలో గంభీర్ అనుసరిస్తున్న 'అగ్రెసివ్' విధానం టెస్ట్ క్రికెట్‌కు సరిపోతుందా లేదా అనే చర్చ మొదలైంది. సూర్యపై వేటు, గిల్‌కు నోఛాన్స్.. భారత టీ20 కెప్టెన్‌గా ఎవరంటే? మాంటీ పనేసర్ సలహా. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన మాంటీ పనేసర్, గంభీర్ నేరుగా జాతీయ జట్టుకు టెస్ట్ కోచ్‌గా వ్యవహరించడంపై తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "టెస్ట్ క్రికెట్ అనేది వ్యూహాలతో కూడిన ఆట. గంభీర్ టీ20లలో మంచి ఫలితాలు సాధించి ఉండవచ్చు, కానీ రెడ్-బాల్ క్రికెట్‌లో కోచింగ్ అనుభవం వేరు. అతను ఏదైనా ఒక రంజీ ట్రోఫీ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తే, ఐదు రోజుల ఆటలో వ్యూహాలను ఎలా అమలు చేయాలో మరింత బాగా అర్థమవుతుంది" అని పనేసర్ పేర్కొన్నారు. అనుభవం లేకపోవడమే లోపమా?..గంభీర్ ఐపీఎల్‌లో మెంటార్‌గా కోల్‌కతా నైట్ రైడర్స్‌ను విజేతగా నిలిపాడు. అయితే అది కేవలం 20 ఓవర్ల ఫార్మాట్ మాత్రమే. దేశవాళీ క్రికెట్‌లో లేదా మరే ఇతర ఫార్మాట్‌లో పూర్తిస్థాయి కోచ్‌గా గంభీర్‌కు గతంలో అనుభవం లేదు. ఇదే విషయాన్ని పనేసర్ నొక్కి చెప్పాడు. టెస్ట్ క్రికెట్‌లో ఆటగాళ్ల మానసిక స్థితిని, పిచ్ పరిస్థితులను అంచనా వేయడంలో గంభీర్ ఇంకా పరిణతి సాధించాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బీసీసీఐ నిర్ణయంపై ఉత్కంఠ..వరుస ఓటముల నేపథ్యంలో బీసీసీఐ ఇప్పటికే గంభీర్‌తో సమీక్షా సమావేశాలు నిర్వహించింది. ఒకవేళ టెస్టుల్లో ఫలితాలు ఇలాగే ఉంటే, కేవలం పరిమిత ఓవర్లకే గంభీర్‌ను పరిమితం చేసి, టెస్టులకు విడిగా వీవీఎస్ లక్ష్మణ్ వంటి అనుభవం ఉన్న ఆటగాడిని కోచ్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది.

# వామ్మో ఇదెక్కడి బాదుడు భయ్యో



ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ గ్లెన్ మాక్స్‌వెల్ మరోసారి తన పవర్‌ను ప్రపంచానికి చాటిచెప్పాడు. బిగ్ బాష్ లీగ్ లో మెల్బోర్న్ స్టార్స్ తరపున ఆడుతూ, ఒక కళ్లు చెదిరే భారీ సిక్సర్‌తో చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో బిగ్ బాష్ లీగ్ చరిత్రలోనే 150 సిక్సర్లు పూర్తి చేసుకున్న అరుదైన మైలురాయిని మాక్స్‌వెల్ చేరుకున్నాడు. బిగ్ బాష్‌లో మాక్స్‌వెల్ ప్రభంజనం.. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యంత వినోదాత్మక బ్యాటర్లలో గ్లెన్ మాక్స్‌వెల్ ఒకరు. ఆస్ట్రేలియా దేశవాళీ టీ20 టోర్నీ అయిన బిగ్ బాష్ లీగ్‌లో మాక్స్‌వెల్ తన హవాను కొనసాగిస్తున్నాడు. మెల్బోర్న్ స్టార్స్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన, తాజాగా జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ మ్యాచ్‌లో మాక్స్‌వెల్ కొట్టిన ఒక సిక్సర్ స్టేడియంలో ఉన్న ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. బౌలర్ విసిరిన బంతిని ఏకంగా 104 మీటర్ల దూరంలో ఉన్న స్టాండ్స్‌లోకి పంపాడు. ఈ భారీ హిట్టింగ్‌తో స్టేడియం మొత్తం మార్మోగిపోయింది. ప్రస్తుతం ఈ సిక్సర్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. మాక్స్‌వెల్ తన క్లాసిక్ రివర్స్ స్వీప్‌లు, లాంగ్ హిట్‌లతో బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. 150 సిక్సర్ల మైలురాయి.. ఈ అద్భుతమైన సిక్సర్‌తో మాక్స్‌వెల్ బిగ్ బాష్ లీగ్ చరిత్రలో 150 సిక్సర్లు పూర్తి చేసిన ఘనత సాధించాడు. బీబీఎల్ చరిత్రలో ఈ మైలురాయిని చేరుకున్న అతి కొద్దిమంది ఆటగాళ్ల జాబితాలో మాక్స్‌వెల్ చేరిపోయాడు. ఇప్పటికే వన్డేలు, అంతర్జాతీయ టీ20లలో ఎన్నో రికార్డులు తన పేరిట లిఖించుకున్న 'బిగ్ షో', ఇప్పుడు తన సొంత గడ్డపై జరుగుతున్న లీగ్‌లోనూ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాడు. మాక్స్‌వెల్ ఫామ్‌లో ఉండటం మెల్బోర్న్ స్టార్స్ జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్. కేవలం బ్యాటింగ్‌లోనే కాకుండా, ఫీల్డింగ్, బౌలింగ్‌లోనూ రాణిస్తూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. రాబోయే మ్యాచ్‌ల్లో కూడా మాక్స్‌వెల్ ఇదే తరహాలో రెచ్చిపోతే, మెల్బోర్న్ స్టార్స్ ఈసారి టైటిల్ గెలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. గ్లెన్ మాక్స్‌వెల్ అంటేనే రికార్డుల వేట. 104 మీటర్ల సిక్సర్, 150 సిక్సర్ల రికార్డుతో ఆయన తన కెరీర్‌లో మరో అద్భుతమైన అధ్యాయాన్ని జోడించుకున్నాడు. ఈ విధ్వంసం ఇలాగే కొనసాగాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు కోరుకుంటున్నారు.

# ఎదురులేని భారత్



తిరువనంతపురం: సొంతగడ్డపై శ్రీలంకతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత్ వరుసగా నాలుగో విజయం సాధించింది. ఆదివారం తిరువనంతపురం వేదికగా భారీ స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమ్‌ఇండియా.. 30 రన్స్ తేడాతో గెలుపొంది సిరీస్‌లో ఆధిక్యాన్ని 4-0కు పెంచుకుంది. మ్యాచ్‌లో తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. 20 ఓవర్లకు రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 221 రన్స్ చేసింది. ఓపెనర్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' స్మృతి మంధాన (48 బంతుల్లో 80, 11 ఫోర్లు, 3 సిక్సర్లు) తిరిగి ఫామ్‌లోకి రాగా షెఫాలీ వర్మ (46 బంతుల్లో 79, 12 ఫోర్లు, 1 సిక్స్) హ్యాట్రిక్ హాఫ్ సెంచరీతో కదం తొక్కింది. రిచా ఘోష్ (16 బంతుల్లో 40 నాటౌట్, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ మెరుపులతో టీ20ల్లో భారత్.. తమ అత్యుత్తమ స్కోరును నమోదుచేసింది. ఇక ఛేదనలో లంక ధాటిగానే ఆడినా కీలక సమయాల్లో వికెట్లు కోల్పోయి ఒత్తిడికి గురైంది. ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 191 రన్స్ చేసింది. కెప్టెన్ చమారి ఆటపట్టు (37 బంతుల్లో 52, 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), హాసిని పెరీరా (33), ఇమేషా దులానీ (29) రాణించారు. భారత బౌలర్లలో వైష్ణవి శర్మ (2/24), అరుంధతి రెడ్డి (2/42)కి తలా రెండు వికెట్లు దక్కాయి. సిరీస్‌లో ఆఖరిదైన ఐదో మ్యాచ్ ఈనెల 30న ఇదే వేదికలో జరుగుతుంది. పదివేల పరుగుల క్లబ్‌లో. ఈ మ్యాచ్‌లో స్మృతి మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. 27 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఆమె అంతర్జాతీయ క్రికెట్‌లో (మూడు ఫార్మాట్లలో కలిపి) పదివేల పరుగులు పూర్తిచేసిన నాలుగో క్రికెటర్‌గా (భారత్ నుంచి రెండో ప్లేయర్)గా రికార్డులకెక్కింది. మహిళా క్రికెట్‌లో ఈ ఘనతను అందుకున్నవారిలో మిథాలీ రాజ్ (314 ఇన్నింగ్స్‌ల్లో 10,868), న్యూజిలాండ్ బ్యాటర్ సుజీ బేట్స్ (343 ఇన్నింగ్స్‌ల్లో 10,652), ఇంగ్లండ్‌కు చెందిన చార్లెస్ ఎడ్వర్డ్స్ (316 ఇన్నింగ్స్‌ల్లో 10,273) మంధాన కంటే ముందున్నారు. అయితే ఈ నలుగురిలో అత్యంత వేగంగా పదివేల పరుగుల మైలురాయిని అందుకున్నది మాత్రం స్మృతి (280 ఇన్నింగ్స్‌ల్లోనే)యే కావడం విశేషం. అలాగే ఈ మ్యాచ్‌లో 3 సిక్సర్లు కొట్టిన ఆమె.. భారత్ తరఫున ఈ ఫార్మాట్‌లో అత్యధిక సిక్స్ (80)లు కొట్టిన హర్మన్‌ప్రీత్ రికార్డు (78)ను అధిగమించింది. సంక్షిప్త స్కోర్లుభారత్: 20 ఓవర్లలో 221/2 (స్మృతి 80, షెఫాలీ 79, షెహానీ 1/32, మధుశాని 1/40)టీ్రశీలంక: 20 ఓవర్లలో 191/6 (ఆటపట్టు 52, హాసిని 33, వైష్ణవి 2/24, అరుంధతి 2/42)

# కేవలం రూ.91 రీఛార్జ్‌తో 28 రోజుల వ్యాలిడిటీ డేటా కాలింగ్ అన్ని బెనిఫిట్స్!




జియో పోర్ట్‌ఫోలియోలో అనేక రీఛార్జ్ ప్లాన్‌లు ఉన్నాయి. కంపెనీ చౌక, ఖరీదైన ప్లాన్‌లను అందిస్తుంది. కానీ బ్రాండ్ కొన్ని ప్రత్యేకమైన ఎంపికలను కూడా అందిస్తుంది. అలాంటి ఒక ప్లాన్ గురించి తెలుసుకుందాం. ఈ ప్లాన్ తక్కువ ధరకు దీర్ఘకాల చెల్లుబాటు వ్యవధితో వస్తుంది. ఈ జియో ప్లాన్ ధర రూ.100 కంటే తక్కువ. జియో రీఛార్జ్ ప్లాన్ల జాబితాలో రూ.91 ప్లాన్ ఉంది. ఈ ప్లాన్ 28 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. ఇది కాలింగ్, డేటా, వంటి ప్రయోజనాలను అందిస్తుంది. ఈ జియో ప్లాన్ 3 డేటాతో వస్తుంది. అయితే, మొత్తం చెల్లుబాటు వ్యవధిలో మీరు ఈ డేటాను ఒకేసారి పొందలేరు. బదులుగా కంపెనీ రోజుకు 100 %వీడీ% డేటాను అందిస్తోంది. అదనంగా 200 %వీడీ% డేటాను అందిస్తోంది. ఈ ప్లాన్ 28 రోజుల పాటు 2.8 డేటా, 200%వీడీ% అదనపు డేటాను అందిస్తుంది. మొత్తం చెల్లుబాటు కాలానికి కస్టమర్లకు అపరిమిత వాయిస్ కాలింగ్, 50 సందేశాలు కూడా లభిస్తాయి. శీతాకాలంలో ఈ కూరగాయను పండించండి.. తక్కువ ఖర్చుతో రెట్టింపు ఆదాయం! మీ వాష్ బేసిన్ ట్యాప్‌పై మొండి మరకలు పోవాలా? అద్భుతమైన ట్రిక్స్! డేటా పరిమితిని చేరుకున్న తర్వాత వినియోగదారులు 64 వేగంతో డేటాను పొందుతారు. ఈ జియో ప్లాన్ అందరు వినియోగదారులకు అందుబాటులో లేదని గమనించండి. కంపెనీ ఈ ప్లాన్‌ను ప్రత్యేకంగా జియోఫోన్ వినియోగదారుల కోసం ప్రారంభించింది. అందరికి అనుకుంటే పొరపాటే. మీరు జియోఫోన్ యూజర్ అయితేనే ఈ ప్లాన్ పొందవచ్చు. అయితే ఈ ప్లాన్ సాధారణ జియో యూజర్లకు అందుబాటులో లేదు. రెగ్యులర్ జియో యూజర్లు ఇతర ప్లాన్‌లను ప్రయత్నించాల్సి ఉంటుంది. జియో కొన్ని విలువైన ప్లాన్‌లను కూడా అందిస్తుంది. కంపెనీ రూ.189 ప్లాన్‌ను అందిస్తుంది. ఇది 28 రోజుల చెల్లుబాటుతో వస్తుంది. ఈ ప్లాన్ 2%+డీ% డేటా, అపరిమిత కాలింగ్, రోజుకు 300 %ూమీూ%లను అందిస్తుంది. జియో ఫోన్ వినియోగదారులకు ఇది అత్యంత చౌకైన ఎంపిక.

# వినియోగదారులకు అలర్ట్ కొత్త ఏడాదిలో మారనున్న 10 కీలక మార్పులు!




సంవత్సరం జనవరిలో కేవలం తేదీ మార్పుకే పరిమితం కాదు. కొత్త సంవత్సరంతో బ్యాంకింగ్, జీతాలు, డిజిటల్ చెల్లింపులు, రైతులు, సాధారణ వినియోగదారులకు సంబంధించిన అనేక ముఖ్యమైన నియమాలు మారబోతున్నాయి. ఇవి మీ దైనందిన జీవితాన్ని, ఖర్చు ప్రణాళికను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయి. ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు ఈ మార్పులను అమలు చేయడానికి సిద్ధమవుతున్నాయి. 2026 కొత్త సంవత్సరంలో కనిపించే 10 ప్రధాన మార్పులను అర్థం చేసుకుందాం. 1. రుణ ఉపశమనం, %ఖీఱ% నియమాలలో మార్పులు:కొత్త సంవత్సరం ప్రారంభంతో అనేక ప్రధాన బ్యాంకులు రుణ వడ్డీ రేట్లను తగ్గించాలని సూచించాయి. దీనివల్ల గృహ, వ్యక్తిగత రుణాలు సాపేక్షంగా చౌకగా మారవచ్చు. ఇంకా స్థిర డిపాజిట్ వడ్డీ రేట్లు కూడా మారతాయి. కొన్ని బ్యాంకులు మెరుగైన రాబడిని అందించవచ్చు. మరికొన్ని స్వల్ప తగ్గింపును అందించవచ్చు. 2. 8వ వేతన సంఘం: ఉద్యోగులు, పెన్షనర్లకు ఆశ:2026 ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త తెస్తుంది. 8వ వేతన సంఘం జనవరి 1, 2026 నుండి అమలు చేయబడుతుందని భావిస్తున్నారు. దీనివల్ల జీతాలు, పెన్షన్లు, అలవెన్సులలో గణనీయమైన సవరణలు రావచ్చు. 8వ వేతన సంఘం కింద జీతాల పెంపుదల కోసం అధికారిక సంఖ్య ఇంకా ఖరారు కాలేదు. అయితే ప్రాథమిక అంచనాల ప్రకారం 20%-%35% పెరుగుదల సాధ్యమే. 7వ వేతన సంఘంలో ఫిట్‌మెంట్ కారకం 2.57 కాగా, 8వ వేతన సంఘంలో ఇది 2.4, 3.0 మధ్య ఉంటుందని అంచనా. 2026-27 ఆర్థిక సంవత్సరంలో కూడా బకాయిలు అందుతాయని భావిస్తున్నారు. 3. ఇప్పుడు పాన్-ఆధార్ లింక్ చేయడం తప్పనిసరి:జనవరి 1, 2026 నుండి చాలా బ్యాంకింగ్, ప్రభుత్వ సేవలకు పాన్, ఆధార్ లింక్ చేయడం తప్పనిసరి అవుతుంది. అలా చేయడంలో విఫలమైతే ఖాతా సంబంధిత సేవలు పరిమితం కావచ్చు లేదా నిలిపివేయవచ్చు. 4. క్రెడిట్ స్కోర్ అప్‌డేట్‌లు ఇప్పుడు వేగం:క్రెడిట్ స్కోర్ అప్‌డేట్‌ల వేగాన్ని పెంచుతున్నారు. గతంలో స్కోర్ ప్రతి 15 రోజులకు అప్‌డేట్ అవుతుంది. ఇప్పుడు అది వారానికోసారి అప్‌డేట్ చేయవచ్చు. సకాలంలో చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలు వేగంగా కనిపిస్తాయి. అలాగే రుణ ఆమోదం ప్రక్రియ మరింత ఖచ్చితమైనదిగా ఉంటుంది. 5. ధరలు చౌకగా మారే అవకాశం. ఏకీకృత టారిఫ్ వ్యవస్థలో మార్పు గ్యాస్ ధరలపై ప్రభావం చూపవచ్చు. మీడియా నివేదికల ప్రకారం, కిలోపై భారీగానే తగ్గే అవకాశం ఉంది. కూడా తగ్గవచ్చు. ఇది వాహన యజమానులు, %ూ్రా+% వినియోగదారులకు ప్రయోజనం చేకూరుస్తుంది. 6. డిజిటల్ చెల్లింపులపై కఠినమైన నియమాలు:డిజిటల్ మోసాలను అరికట్టడానికి, , మొబైల్ నంబర్లు, బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన నియమాలను కఠినతరం చేస్తారు. సిమ్ ధృవీకరణ, డిజిటల్ గుర్తింపుపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. ఇది ఆన్‌లైన్ మోసాల కేసులను తగ్గిస్తుంది. 7. సోషల్ మీడియాలో వయోపరిమితులకు సన్నాహాలు:16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకంపై వచ్చే ఏడాది ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను ప్రవేశపెట్టవచ్చని మీడియా నివేదికలు సూచిస్తున్నాయి. పిల్లల ఆన్‌లైన్ భద్రతను పెంచడానికి వయస్సు ధృవీకరణ, తల్లిదండ్రుల నియంత్రణలు వంటి లక్షణాలను తప్పనిసరి చేయవచ్చు. 8. పెట్రోల్-డీజిల్ వాహనాలపై కొత్త పరిమితులు:కాలుష్యాన్ని నియంత్రించడానికి ప్రధాన నగరాల్లో పాత లేదా వాణిజ్య పెట్రోల్-డీజిల్ వాహనాలపై ఆంక్షలు పెరగవచ్చు. ఇది క్యాబ్‌లు, డెలివరీ సేవలు, లాజిస్టిక్స్ సేవలపై కూడా ప్రభావం చూపుతుంది. 9. రైతుల కోసం అప్‌డేట్ నియమాలు:కొన్ని రాష్ట్రాల్లో వంటి పథకాల ప్రయోజనాలను పొందడానికి ఒక ప్రత్యేకమైన రైతు %×ఱ% అవసరం కావచ్చు. పంట బీమా పథకంలో కూడా మార్పులు సాధ్యమే. అడవి జంతువుల వల్ల కలిగే నష్టాన్ని సకాలంలో నివేదించడం వల్ల కవరేజ్ లభిస్తుంది. 10. గ్యాస్, ఇంధనం, పన్నులలో మార్పులు:ఎప్పటిలాగే , వాణిజ్య గ్యాస్, విమాన ఇంధన ధరలు జనవరి 1న సవరించబడే అవకాశం ఉంది. అదనంగా ముందుగా నింపిన కొత్త ఫారమ్ పన్ను దాఖలును సులభతరం చేస్తుంది. అయితే పరిశీలన, సమ్మతి మరింత కఠినంగా మారవచ్చు.

# మీ క్రెడిట్ కార్డును వాడుకోమని మీ ఫ్రెండ్‌కు ఇస్తున్నారా




ఇటీవలి ఆదాయపు పన్ను కేసు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఒక చార్టర్డ్ అకౌంటెంట్ ఒక వ్యక్తి క్రెడిట్ కార్డ్ లావాదేవీ కోసం ఆదాయపు పన్ను నోటీసు అందుకున్నట్లు నివేదించారు. ఈ కేసులో తన క్రెడిట్ కార్డుపై రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేసినప్పటికీ, అతను ఎప్పుడూ ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయలేదు. దర్యాప్తులో అతను తన క్రెడిట్ కార్డుతో తన స్నేహితుల ఖర్చులకు డబ్బులు చెల్లిస్తున్నాడని తేలింది. కార్డ్ రివార్డులు, క్యాష్‌బ్యాక్ సంపాదించడానికి అతను ఇలా చేశాడు, దీనిని సాధారణంగా కార్డ్ రొటేషన్ అని పిలుస్తారు. అయితే వ్యవస్థ ఎటువంటి సంబంధిత ఆదాయం లేకుండా ఇంత పెద్ద ఖర్చును గుర్తించినప్పుడు, ఆదాయపు పన్ను శాఖ అనుమానం వ్యక్తం చేసి దర్యాప్తు కోసం విషయాన్ని తన కస్టడీలోకి తీసుకుంది. ఆ ఖర్చును సోర్స్ చేయలేదని భావించి ఆదాయపు పన్ను శాఖ డిమాండ్ నోటీసు జారీ చేసింది. ఈ రోజుల్లో క్రెడిట్ కార్డ్ చెల్లింపులకు సంబంధించిన ఈ నోటీసులు సర్వసాధారణం అవుతున్నాయి. సాధారణంగా కొనుగోళ్లపై రివార్డులుగా పొందిన డిస్కౌంట్‌లపై పన్ను ఉండదు, కానీ క్యాష్‌బ్యాక్ లేదా రివార్డులను డబ్బుగా మార్చి, విలువ ఒక సంవత్సరంలో రూ.50,000 దాటితే, అవి పన్నుకు లోబడి ఉండవచ్చు. ఆడిట్ సమయంలో క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్‌లను సమర్పించినప్పుడు, వాటిపై పెద్ద క్యాష్‌బ్యాక్‌లు కనిపించడం కూడా పన్ను ఆందోళనలను రేకెత్తిస్తుంది. ఈ రోజుల్లో క్రెడిట్ కార్డ్ చెల్లింపులకు సంబంధించిన ఈ నోటీసులు సర్వసాధారణం అవుతున్నాయి. సాధారణంగా కొనుగోళ్లపై రివార్డులుగా పొందిన డిస్కౌంట్‌లపై పన్ను ఉండదు, కానీ క్యాష్‌బ్యాక్ లేదా రివార్డులను డబ్బుగా మార్చి, విలువ ఒక సంవత్సరంలో రూ.50,000 దాటితే, అవి పన్నుకు లోబడి ఉండవచ్చు. ఆడిట్ సమయంలో క్రెడిట్ కార్డ్ స్టేట్‌మెంట్‌లను సమర్పించినప్పుడు, వాటిపై పెద్ద క్యాష్‌బ్యాక్‌లు కనిపించడం కూడా పన్ను ఆందోళనలను రేకెత్తిస్తుంది. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 285 ప్రకారం.. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు సంవత్సరానికి రూ.10 లక్షలకు పైగా జరిగే పెద్ద లావాదేవీలను పన్ను శాఖకు నివేదించాలి. ఇందులో క్రెడిట్ కార్డ్ రూ.10 లక్షలకు పైగా జరిగే పెద్ద లావాదేవీలను పన్ను శాఖకు నివేదించాలి. ఇందులో క్రెడిట్ కార్డ్ చెల్లింపుల వివరాలు ఉంటాయి, ఖర్చు ప్రత్యేకతలు కాదు. దీని అర్థం మీరు స్నేహితుడికి చెల్లింపు చేసినప్పటికీ, అది మీ కి లింక్ చేయబడి ఉంటుంది. మీరు వేరే విధంగా నిరూపించకపోతే ఆ ఖర్చు మీదేనని శాఖ భావిస్తుంది.




# రాజాసాబ్ ట్రైలర్ 2.0...

## ఇది మరో లెవెల్!

హారర్, కామెడీ, రొమాన్స్ అంశాలతో కూడిన ఎంటర్‌టైనర్‌గా చిత్రం2026 సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్త రిలీజ్‌పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న కొత్త చిత్రం 'ది రాజాసాబ్' నుంచి ట్రైలర్ 2.0 విడుదలైంది. హారర్, కామెడీ, రొమాన్స్ అంశాల కలబోతగా ఉన్న ఈ ట్రైలర్, సినిమాపై అంచనాలను మరింత పెంచింది. భారీ విజువల్స్, అద్భుతమైన వీఎఫ్ఎక్స్‌తో కూడిన ఈ ట్రైలర్‌ను చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రాన్ని 2026 జనవరి 9న సంక్రాంతి కానుకగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.దర్శకుడు మారుతి తనదైన మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దినట్లు ట్రైలర్‌ను బట్టి అర్థమవుతోంది. "నువ్వు ఒంటరివి కావు" అనే ట్యాగ్‌లైన్‌తో మొదలైన ఈ వీడియో, ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇస్తానని హామీ ఇస్తోంది. ప్రభాస్ వింటేజ్ లుక్స్, కామెడీ టైమింగ్ ఆకట్టుకుంటున్నాయి. తమన్ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్ సరసన మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాలీవుడ్ ప్రముఖ నటులు సంజయ్ దత్, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తెలుగుతో పాటు హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

# 'అప్పలసూరి'గా జగపతిబాబు...

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. భారీ అంచనాల మధ్య రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం ఒక కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు జగపతిబాబు పోషిస్తున్న పాత్రను, ఆయన ఫస్ట్ లుక్‌ను సోమవారం అధికారికంగా విడుదల చేసింది.ఈ సినిమాలో జగపతిబాబు 'అప్పలసూరి' అనే శక్తివంతమైన, ప్రభావవంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటన మరోసారి మాస్టర్‌క్లాస్‌గా నిలుస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేసింది. విడుదల చేసిన పోస్టర్‌లో జగపతిబాబు తనదైన విలక్షణమైన లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. అసలు, ఆ పోస్టర్ లో ఉన్నది జగపతిబాబే అనేలా ఆయన మేకప్ ఉంది. ఈ పాత్ర సినిమాకు చాలా కీలకం కానుందని తెలుస్తోంది. ఈ పాన్-ఇండియా చిత్రంలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్ ఓ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది.




# 'శంబాల' పై ప్రభాస్ ప్రశంసలు

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు ఏడాదికి ఒక సినిమా అంటేనే అభిమానులకు పండగగా ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం ప్రభాస్ వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా మారిపోయారు. భారీ బడ్జెట్ చిత్రాలు, విభిన్న కథలతో తన కెరీర్‌ను కొత్త దిశలో తీసుకెళ్తున్నారు. మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ప్రభాస్ తాజా చిత్రం 'రాజాసాబ్' విడుదలకు సిద్ధంగా ఉంది.హారర్, కామెడీ జానర్‌లో రూపొందిన ఈ చిత్రంలో ప్రభాస్ ఓ డిఫరెంట్ అవతార్‌లో కనిపించనున్నారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందించగా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ సినిమాపై అంచనాలను గణనీయంగా పెంచాయి. జనవరి 9న ఈ చిత్రం థియేటర్లలో సందడి చేయనుంది.ఇదిలా ఉండగా, తాజాగా ప్రభాస్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. తన సినిమాల పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ, తోటి నటుల విజయాలను గుర్తించి అభినందించడం ప్రభాస్‌కు కొత్త కాదు. ఈసారి కూడా అదే చేశారు. టాలీవుడ్ హీరో ఆది సాయికుమార్ నటించిన 'శంబాల' సినిమా విజయం సాధించడంపై ప్రభాస్ స్పందించారు.ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా "ఆది అండ్ టీమ్‌కు కంగ్రాట్యులేషన్స్... 'శంబాల' సినిమా అద్భుతమైన విజయం సాధించింది" అంటూ ప్రశంసలు కురిపిస్తూ మూవీ పోస్టర్‌ను షేర్ చేశారు. ఆది సాయికుమార్, అర్చన అయ్యర్ జంటగా నటించిన 'శంబాల' సినిమాకు యుగంధర్ ముని దర్శకత్వం వహించారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను పొందడమే కాకుండా, బాక్సాఫీస్ వద్ద కూడా నిలకడగా వసూళ్లు రాబడుతోంది.



# శ్రీవారిని దర్శించుకున్న ఛాంపియన్స్




తిరుమల శ్రీవారిని 'ఛాంపియన్' చిత్ర బృందం దర్శించుకుంది. సోమవారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో సినిమా హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్.. స్వామివారి సేవలో చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

# రూ.600 కోట్లకు అల్లు అర్జున్-అట్లీ సినిమా డిజిటల్ రైట్స్?



టాలీవుడ్ హీరో అల్లు అర్జున్, కోలీవుడ్ మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో కొత్త చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో దీపికా పదుకొనే, మ ృణాల్ ఠాకూర్, రష్మిక మందన్న, జాన్వీ కపూర్ తదితర స్టార్ హీరోయిన్లు మెరవనున్నారని సమాచారం. అట్లీ, హాలీవుడ్ స్థాయి టెక్నీషియన్లను ఉపయోగించి అత్యాధునిక వీఎఫ్ఎక్స్ హంగులతో ఈ చిత్రాన్ని విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నాడు. 2027 వేసవిలో రిలీజ్ కానున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ మూవీ ఓటీటీ హక్కుల విషయంలో సరికొత్త రికార్డు స ృష్టించబోతున్నట్టు సమాచారం. నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ రైట్స్ కోసం ఈ చిత్రానికి ఏకంగా రూ. 600 కోట్ల ఆఫర్ చేసినట్టు తెలుస్తోంది. ఇది అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' కోసం పొందిన రూ. 275 కోట్ల రికార్డును రెట్టింపు కంటే ఎక్కువగా అధిగమించడం విశేషం. అదే జరిగితే... దాదాపు రూ. 1,000 కోట్ల బడ్జెట్‌లో రూపొందుతున్న ఈ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇండియన్ సినీ చరిత్రలో అత్యధిక ఓటీటీ రేట్ సాధించిన సినిమా అవ్వనుంది.ఈ భారీ డీల్ వార్త సోషల్ మీడియాలో ఫ్యాన్స్ మధ్య పెద్ద చర్చకు కారణమవుతోంది. అల్లు అర్జున్ అభిమానులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ "ఇది మా హీరో రేంజ్" అంటూ సోషల్ మీడియా వేదికగా కామెంట్లు పెడుతున్నారు.

# లెనిన్ కోసం భాగ్య శ్రీ వెయిటింగ్..!

అందం, అభినయం ఉన్నా కూడా హిట్ అందుకోవడంలో కాస్త వెనుకబడి ఉంది అందాల భామ భాగ్య శ్రీ బోర్స్. పర్‌ఫెక్ట్ స్టార్ హీరోయిన్ మెటీరియల్ అయిన ఈ అమ్మడు తొలి సినిమా మిస్టర్ బచ్చన్ తోనే యూత్ ఆడియన్స్ కి హాట్ ఫేవరేట్ అయ్యింది. మిస్టర్ బచ్చన్ సరిగా మెప్పించలేకపోయినా విజయ్ దేవరకొండ కింగ్ డం తో సత్తా చాటుతుందని అనుకోగా ఆ సినిమాలో ఆమెది హీరోయిన్ కి తక్కువ సైడ్ రోల్ కి ఎక్కువ అన్నట్టుగా చేశారు. కనీసం ఆ సినిమాలో హీరో హీరోయిన్ మధ్య ఉన్న సాంగ్ కూడా తీసేసి భాగ్య శ్రీ ఫ్యాన్స్ ని హర్ట్ అయ్యేలా చేశారు.
ఆ సినిమా రిజల్ట్ ని ఊహించని భాగ్య శ్రీ కాస్త అప్సెట్ అయ్యింది. ఐతే నవంబర్ లో రెండు వారాల గ్యాప్ లో రెండు సినిమాలతో అలరించింది భాగ్య శ్రీ. అందులో ఒకటి కాంత కాగా మరొకటి రామ్ తో చేసిన ఆంధ్రా కింగ్ తాలూకా. రామ్ సినిమా కాస్త సందడి చేసినా కాంత ఎలా వచ్చిందో అలానే వెళ్లింది. ఆంధ్రా కింగ్ తాలూకా మంచి సినిమానే కానీ అది ఎందుకో ఆడియన్స్ సరిగా రిసీవ్ చేసుకోలేదు. ఆంధ్రా కింగ్ లో భాగ్య శ్రీ లుక్స్ ఆకట్టుకున్నాయి. ఐతే అమ్మడు నెక్స్ట్ అక్కినేని అఖిల్ తో లెనిన్ సినిమా చేస్తుంది. చేస్తున్న సినిమాలన్నీ రిలీజ్ ముందు బజ్ రావడం ఆఫ్టర్ రిలీజ్ నీరస పడేలా చేయడం భాగ్య శ్రీ కెరీర్ లో ఇప్పటి వరకు అది రిపీట్ అవుతూ వచ్చింది. ఐతే లెనిన్ విషయంలో అది జరగకూడదని అనుకుంటుంది భాగ్యం. కాంత, ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాల ఫలితాలు ఎలా ఉన్నా ఆమె గ్లామర్ తో పాటు యాక్టింగ్ టాలెంట్ ని ఆడియన్స్ గుర్తించారు. లెనిన్ తో కమర్షియల్ హిట్ పడితే.. సో లెనిన్ తో కమర్షియల్ హిట్ పడితే అమ్మడు తిరిగి ఫాంలోకి వచ్చినట్టే అవుతుంది. అందుకే లెనిన్ సినిమా కోసం భాగ్య శ్రీ ఆసక్తిగా ఎదురుచూస్తుంది. అసలైతే అఖిల్ లెనిన్ కూడా నవంబర్ రిలీజ్ ప్లాన్ చేశారు కానీ పోస్ట్ ప్రొడక్షన్ ఇంకా కాస్త షూటింగ్ అవ్వకపోవడంతో నెక్స్ట్ ఇయర్ ఫిబ్రవరి లేదా సమ్మర్ రిలీజ్ అనుకుంటున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, అన్నపూర? స్టూడియోస్ కలిసి లెనిన్ సినిమా నిర్మిస్తున్నారు. మురళి కిషోర్ అబ్బూరు డైరెక్ట్ చేస్తున్న లెనిన్ సినిమా నుంచి అప్పట్లో వచ్చిన టీజర్ ఇంప్రెస్ చేసింది. ఈ సినిమాలో ముందు హీరోయిన్ గా శ్రీలీలను అనుకోగా ఆమెతోనే టీజర్ వదిలారు. కానీ కొంత షెడ్యూల్ అయ్యాక శ్రీలీల డేట్స్ అడ్జెస్ట్ అవ్వట్లేదని ఆమె ప్లేస్ లో భాగ్య శ్రీని తీసుకున్నారు. మరి భాగ్య శ్రీ ఎదురుచూస్తున్న హిట్ సినిమా లెనిన్ అవుతుందా లేదా అన్నది ఆ సినిమా రిలీజ్ అయ్యాక తెలుస్తుంది.



# మార్చి 6న అల్లు శిరీష్ వివాహం



నటుడు అల్లు శిరీష్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. తన ప్రియురాలు నయనికతో అక్టోబర్‌లో నిశ్చితార్థం ఘనంగా జరిగింది. తాజాగా శిరీష్ తన పెళ్లి తేదీని వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 6న వివాహం జరగనున్నట్లు తెలిపారు. ఇన్‌స్టాలో ట్రెండ్ అవుతోన్న ఓ పాటతో అల్లు అయాన్, అర్హాలతో రీల్ చేస్తూ అధికారికంగా చెప్పారు. 'బాబాయ్ సంగీత్ ఎప్పుడు ఉంటుంది' అని వాళ్లు అడగ్గా.. 'మనం దక్షిణాది వాళ్లం.. అలాంటివి చేసుకోం' అని శిరీష్ అన్నారు. అయితే, పెళ్లి ఎక్కడ జరుగుతుంది అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఇక అల్లు అర్జున్ - స్నేహారెడ్డి వివాహం కూడా 2011లో మార్చి 6నే జరగడం విశేషం.శిరీష్-నయనికల ప్రేమ ప్రయాణం వరుణ్- లావణ్యల పెళ్లి సమయంలో ప్రారంభమైంది. వీరి పెళ్లికి నటుడు నితిన్ సతీమణి షాలినితో కలిసి హాజరయ్యారు. షాలినితో ఆమె స్నేహితురాలు నయనిక కూడా వచ్చారు. తొలిసారి ఆమెను అప్పుడే చూసినట్లు శిరీష్ తెలిపారు. ఆ పరిచయం స్నేహంగా మారి ఇద్దరి మధ్య ప్రేమ చిగురించినట్లు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. 'మా పరిచయం ఎలా మొదలైందంటూ ఏదోఒక రోజు మా పిల్లలు అడిగితే ఇదే చెబుతా. నన్ను తమ సర్కిల్‌లో చేర్చుకున్న నయనిక స్నేహితులందరికీ థాంక్స్' అని చెప్పారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613